Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 182 Issue No : 182 | మంగళవారం Tuesday | అక్టోబర్ 27, 2026 27 OCTOBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# తుఫానుతో భారీ వర్షాలకు ఆస్కారం

- ఆస్తి, ప్రాణనష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు
- వరద ముంపు ప్రాంతాల్లో షెల్టర్లకు బాధితుల తరలింపు
- తుఫాను గమనం అంచనా వేస్తూ ప్రతి 4 గంటలకూ హెచ్చరికలు జారీ
- అర్నబ్ తుఫాన్ పరిస్థితిపై గంట గంటకూ సమీక్షిస్తోన్న సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాల యం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో సీఎం వర్చువల్‌గా సమీక్షించారు. నేడు తీవ్ర తుఫానుగా మారి ఇది రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికల రీత్యా ఆయా తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నెల 28వ తేదీన ఆర్నబ్ తీవ్ర తుఫాను బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను కారణంగా నేడు మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకూ వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు. అలాగే తీరప్రాంతాల వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని సీఎంకు తెలియచేశారు.



తుఫాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 28,29 తేదీల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. అర్నబ్ తుఫాన్ విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**షెల్టర్లకు లోతట్టు ప్రాంతాల ప్రజలు :** తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాను షెల్టర్లకు

- మిగతా 2లో..



# తీవ్రరూపం దాల్చుతున్న 'అర్నబ్'

- ఏపి, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్

న్యూఢిల్లీ : బంగాళాఖాతంలో 'అర్నబ్' తుఫాను క్రమంగా తీవ్రరూపం దాల్చు తోంది. మధ్య-తూర్పు, దానిని ఆనుకుని ఉన్న మధ్య-పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గడిచిన ఆరు గంటల్లో గంటకు దాదాపు 15 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా పయ నించి తుఫానుగా మారింది. సోమవా రం, అక్టోబర్ 26న భారతీయ కాలమా నం ప్రకారం ఉదయం 5:30 గంటలకు ఈ తుఫాను 15.4 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 88.9 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. వాతావరణ శాఖ బులెటిన్ ప్రకారం, ఈ తుఫాను క్రమంగా వాయువ్య దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉంది. సోమవారం అర్ధరాత్రి నాటికి ఇది తీవ్ర తుఫానుగా, మంగళవారం నాటికి అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీరప్రాంతాల్లో ఈదు రుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముందస్తు అంచనాల ప్రకారం, ఈ తుఫాను వాయువ్య దిశగా పయనించి బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల – విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది.

- మిగతా 2లో..



## నాలుగు రోజుల నష్టాలకు తెర..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస నష్టాల నుంచి కోలుకుని లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్నప్పటికీ, ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు ఊరట లభించింది.

2 లో



## డిశంబరు 4-6 తేదీల్లో తిరుపతిలో డిజిపిలు,ఐజిపిల సమావేశం

- ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : డిశంబరు 4నుండి 6వరకు తిరుపతిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (IISER)లో డిజిపిలు, ఐజిపిల సమావేశం జరగనుంది.

2 లో

# ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



## 2018నాటి పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఉపశమనం

లక్నో : 2018నాటి పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్ గాంధీకి ఉపశమనం లభించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో సుల్తాన్‌పూర్ జిల్లాలోని ఎంపి/ఎమ్మెల్యే కోర్టు సోమవారం రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది.

- మిగతా 2లో..

# 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు..

- అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం: అచ్చెన్నాయుడు
- బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
- రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం
- రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన
- అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు గుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి.

- మిగతా 2లో..



# అవి ఏకగ్రీవాలు కాదు..

## కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు : షర్మిల

- స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై షర్మిల ఫైర్
- కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శ
- ఈసీ, పోలీసు వ్యవస్థలను కూటమి నిర్వీర్యం చేసిందని వ్యాఖ్య
- ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేసి, విచారణ జరపాలని డిమాండ్
- గత ప్రభుత్వం చేసిన తప్పులనే కూటమి పునరావృతం చేస్తోందని ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు.

2 లో



# ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు..

## ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది : మంత్రి అనగాని

- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు పాల్పడుతోందన్న మంత్రి అనగాని
- పుంగనూరు, తిరుపతి సహా పలుచోట్ల దాడులే ఇందుకు నిదర్శనమని వెల్లడి
- ప్రజలు చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతిస్తున్నారని స్పష్టీకరణ
- 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ తీరు మారలేదని విమర్శ

వివరాలు 2లో..

# సంపాదకీయం

## మంటల్లోనే మణిపూర్!

దేశ ఈశాన్య సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్ గత మూడేళ్లుగా నిరంతరాయంగా రగులుతుండటం తీవ్ర ఆందోళనకరం. సహజ సౌందర్యానికి, విభిన్న సంస్కృతులకు నెలవైన ఆ రాష్ట్రం భయానక యుద్ధ భూమిగా మారడం బాధాకరం. మూడేళ్లుగా సాగుతున్న తెగల ఘర్షణలు కేవలం శాంతిభద్రతల సమస్య కాదు. ప్రజల దైనందిన జీవితాలను, ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కిన మానవీయ సంక్షోభం. ఒకప్పుడు కలిసిమెలిసి బతికిన మనుషులు నేడు ఒకరినొకరు అనుమానంతో చూసుకొనే విషాద దృశ్యం. భయం నీడలో కాలం వెళ్లదీస్తున్న మణిపూర్ ప్రజల ఆర్తనాదాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాతి గుండెలను కరిగించలేకపోతున్నాయి. 2023 మే నెలలో మెయితీ, కుకీ-జో వర్గాల మధ్య ప్రారంభమైన జాతి వైరం, నేడు నాగా తెగలను కూడా వివాదంలోకి లాగుతూ రాష్ట్ర సమగ్రతకు ప్రశ్నార్థకంగా మారింది. తాత్కాలిక శాంతి చర్చలు, అదనపు బలగాల మోహరింపు వంటి అరకొర చర్యలు ఈ రగిలే గాయాన్ని నయం చేయలేవని గత అనుభవాలు పదే పదే హెచ్చరిస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిద్రమత్తులోనే జోగుతుండటం అత్యంత విచారకరం. ఒక రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. కానీ, ఆ బాధ్యతను నెరవేర్చడంలో ప్రభుత్వాలు వరుసగా విఫలమైతే ప్రజలు ఎవరిని నమ్మాలి? తాజాగా అక్టోబర్ 19న అడవిలో కట్టెలు సేకరించేందుకు వెళ్లిన మెయితీ గ్రామ స్థులపై సాయుధులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటనతో ఇంఫాల్ లోయలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. మృతదేహాలను ముఖ్యమంత్రి నివాసం వద్దకు తీసుకొచ్చి ప్రజలు నిరసన తెలిపారు. అనంతరం జరిగిన 48 గంటల బంద్‌తో సాధారణ జనజీవనం స్తంభించింది. అక్టోబర్ 24న వేలాది మంది ప్రజలు చారిత్రక 'కాంగ్లా కోట' వద్దకు చేరుకుని, గిన్నెలు వాయిస్తూ, వాహనాల హారన్లు మ్రోగిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హింస ముగిసిందని, సాధారణ పరిస్థితులు తిరిగి వచ్చాయని చెబుతున్న తరుణంలో తాజా ఘటనలు మళ్లీ భయాందోళనలు రేకెత్తించాయి. ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్ ప్రభుత్వం ముందున్న సవాళ్లు ఎంత తీవ్రమైనవో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారిక నివేదికల ప్రకారం...2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోగా, సుమారు 70,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులై కాందిశీకుల శిబిరాల్లో దుర్భర జీవితం గడుపుతున్నారు. సొంత రాష్ట్రంలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లలేని దయనీయ స్థితి నెలకొంది. గణాంకాల్లో కనిపించే ఈ సంఖ్యల వెనుక ఒక్కొక్క మనిషికి ఒక్కో విషాదగాథ ఉంది. కుటుంబ సభ్యులను కోల్పోయినవారు, ధ్వంసమైన ఇళ్లను చూసి కన్నీరు పెట్టుకునేవారు, చదువుకు దూరమైన పిల్లలు, ఉపాధి కోల్పోయిన కార్మికులు, భవిష్యత్తుపై ఆశలు సన్నగిల్లిన యువత.. వీరందరి బాధలకు పరిష్కారం చూపాల్సిన పాలకులు మాత్రం శాంతి ప్రకటనలకే పరిమితమవుతున్నారు. మణిపూర్ సంక్షోభం కేవలం తెగల మధ్య ఘర్షణ మాత్రమే కాదు; ఇది పూర్తిగా రాజకీయ, పరిపాలనా వైఫల్యానికి పరాకాష్ట. బీరేన్ సింగ్ హయాంలో పెరిగిన ఘర్షణలు, ఆ తర్వాత రాష్ట్రపతి పాలన విధించినా, కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం పాలకుల అసమర్థతను ఎత్తిచూపుతోంది. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో గళమెత్తిన జెన్-జీల నిరసనలను అణచివేయడానికి కేంద్రప్రభుత్వం చూపించిన క్రియాశీలత... ప్రాణ, మానాలు కోల్పోతున్న మణిపూర్ ప్రజలను రక్షించడంలో చూపలేదనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మణిపూర్ కొండ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న ఖనిజ సంపద, అటవీ నిధులను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే కుటిలత్వం దాగివుందని, గిరిజనులను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టడానికే ఈ ఘర్షణలను తెరవెనుక ప్రోత్సహిస్తున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. మెయితీ, కుకీ-జో, నాగా తెగల ప్రతినిధులతో ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలి. మణిపూర్‌లోని ప్రతి బిడ్డ నిర్భయంగా పాఠశాలకు వెళ్లాలి. ప్రతి మహిళ స్వేచ్ఛగా ప్రయాణించగలగాలి. ప్రతి రైతు తన పొలానికి, ప్రతి కార్మికుడు తన పనికి, ప్రతి కుటుంబం తన ఇంటికి నిర్భయంగా వెళ్లగలగాలి. ఏ జాతికి చెందినవారైనా తమ గుర్తింపును దాచుకోవాల్సిన అవసరం లేని పరిస్థితి వుండాలి. అదే నిజమైన సాధారణ స్థితి. దేశంలోని యువత నిరసనలను అణచివేయడానికి ప్రభుత్వం చూపే బలప్రదర్శన కంటే, ప్రజల కన్నీళ్లు తుడవడానికి చూపే చొరవే ప్రజాస్వామ్యానికి నిజమైన కొలమానం. ప్రజల మధ్య కుల, మత గోడలు కట్టి పాలించడం సులభం కావచ్చు; ఆ గోడలను కూల్చి ప్రజల్లో విశ్వాసాన్ని నింపడమే నిజమైన నాయకత్వం. అప్పుడే భారత ప్రజాస్వామ్యం నిజంగా గెలిచినట్లు.

## 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు..

ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (IMD), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

**తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా



ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం**

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

**రైతన్నలకు ప్రత్యేక సూచనలు**

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

## ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు..

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి. ఇక ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది" అని అనగాని సత్యప్రసాద్ తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.



## తుఫానుతో భారీ వర్షాలకు ఆస్కారం

తరలించాలని సీఎం నిర్ద?శించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్ 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సీఎం సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాన్నారు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళంతోపాటు కోస్టుగార్డుల సేవలను ఈ తుఫాన్ సహాయక చర్యల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం నిర్దేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా తీరప్రాంతానికి తిరిగి రప్పించామని అధికారులు వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షితంగా హార్బర్‌లకు చేరుకున్నాయని తెలిపారు. తుఫాను బలహీన పడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు.



పంటనష్టం వాటిల్లకుండా చర్యలు

కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖను ముఖ్యమంత్రి నిర్దేశించారు. దాదాపు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు ముప్పు పొంచివున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లోనూ సరకులు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చిన చోట తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు తుపాను గమనాన్ని అంచనా వేస్తూ ప్రతీ నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికతో కూడిన బులెటిన్ జారీ చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంలో వచ్చిన తుఫాన్ల సమాచారాన్ని విశ్లేషిస్తూ రైతులకు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించాలని సూచించారు. అలాగే ఆర్నబ్ తుఫాను కారణంగా వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొత్తం 22 రిజర్వాయర్ల పరిధిలో వరద ప్రవాహాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రవాహాలతో 10-12 టీఎంసీల మేర నీటిని నిల్వ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తాండవ, రైవాడ, యేలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, తాడిపూడి రిజర్వాయర్లకు పూర్తి స్థాయిలో నీటి నిల్వలు వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. వాగులు, వంకలు, కాలువల ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తుఫాను ప్రభావంపై దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలని సీఎం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇక తుఫాన్ ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో చూసి... ఆ మేరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని సీఎం సూచించారు. ప్రతి తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి గంట గంటకూ అధికారుల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ సహా వివిధ శాఖల అధికారులు, మంత్రి రామానాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు.

## నాలుగు రోజుల నష్టాలకు తెర..

### లాభాల బాటలో స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ ఉదయం 72,990.04 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. అనంతరం కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్న ఈ సూచీ 482.92 పాయింట్లు పెరిగి 73,606.75 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 153.20 పాయింట్లు లాభపడి 22,753.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 95.19గా నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 ప్రధాన కంపెనీల్లో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు అధిక లాభాలను నమోదు చేశాయి. అయితే బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు ధర 4,018 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## డిశంబరు 4-6 తేదీల్లో తిరుపతిలో డిజిపిలు,ఐజిపిల సమావేశం

ఈసమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు హాజరు కానున్నారు.ఇందుకు సంబంధించి సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఇంటర్ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.ఎక్కడా పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈసమావేశంలో అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి,హోం శాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, కమీషనర్ సెకండరి హెల్తు చక్రధర్ బాబు,ఎస్ఐబి డిప్యూటీ డైరెక్టర్ అంబిక,ఐపిఎస్ అధికారి కాంతి రాణా తాతా తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా టిఆర్అండ్బి కార్యదర్శి కె.శశిధర్,తిరుపతి కలెక్టర్ డా.వెంకటేశ్వర్,ఎస్పి,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## అవి ఏకగ్రీవాలు కాదు..

షర్మిల తన ప్రకటనలో, "రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 'కూటమి కమిషన్'గా మార్చారు. నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని ఖూనీ చేసి, పోలీసు వ్యవస్థను బానిసగా మార్చి, ప్రతిపక్ష అభ్యర్థుల పత్రాలు చించివేసి, వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఘనత కూటమి పార్టీలది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీలు, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగినవి ఏకగ్రీవాలు కాదని, కూటమి సృష్టించిన భయోత్పాతానికి నిదర్శనాలని ఆమె అన్నారు. ఇది ప్రభంజనం కాదని, కూటమి రాజకీయ నిస్తేజమని అభివర్ణించారు.గత వైసీపీ ప్రభుత్వంతో పోలుస్తూ షర్మిల, కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. "ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని, మీరు అదే తింటారా? కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదా? బలవంతపు ఏకగ్రీవాల పేరుతో ఈ విచక్షణా రాహిత్యం ఎందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బలవంతపు ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల డిమాండ్ చేశారు. ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేసి, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల హక్కులను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## 2018నాటి పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఉపశమనం

"కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెంగళూరులో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసును సుల్తాన్‌పూర్‌లోని ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు జడ్జి జస్టిస్ శుభం వర్మ కొట్టివేశారు'' అని ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం చైర్మన్ కున్వర్ సింగ్ నిషాద్ తెలిపారు. 2023లో రాహుల్‌గాంధీ కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. ఈ కేసులో అక్టోబర్ 13న తీర్పు వెల్లడించనున్నట్లు కోర్టు గతంలో ప్రకటించింది. అనంతరం ఆ తేదీని అక్టోబర్ 26కి మార్చింది. ఈ కేసు విచారణకు హాజరయ్యేందుకు ఆయన సోమవారం ఉదయం లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం సుల్తాన్‌పూర్



బయలుదేరారు. సుల్తాన్ పూర్ వెళుతుండగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై ఆయన కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. అయితే, ఈ ప్రమాదం నుండి రాహుల్ త్రుటిలో తప్పించుకున్నారు. కాన్వాయ్‌లో ఉన్న వాహనాల్లో ఒకటి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకనున్న వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## తీవ్రరూపం దాల్చుతున్న 'అర్నబ్'

తీరం దాటే సమయంలో గాలుల వేగం గంటకు 115 నుండి 125 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈదురుగాలుల వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు కూడా చేరే అవకాశం వుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.



ముఖ్యంగా సముద్రం అల్లకల్లోలంగా మారడం, ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్తలు తుఫాను మార్గం, దాని తీవ్రతలో వచ్చే మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రాబోయే రోజుల్లో తుఫాను వేగం, తీరం దాటే ప్రాంతానికి సంబంధించిన అంచనాలలో మార్పులు ఉండవచ్చు. తుఫాను ప్రభావ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు బులెటిన్‌లో పేర్కొన్నారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలని కోరారు. జాలర్లు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సంబంధిత అధికారులు ఆదేశించారు. పర్యాటకులు, తీరప్రాంత ప్రజలు వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. మొత్తంమీద, అక్టోబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుఫాను ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రాబోయే 48 గంటల్లో తుఫాను తీవ్రత, దాని గమనంపై వాతావరణ శాఖ నిశితంగా దృష్టి సారించింది.

# ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**❖ఎన్నికల సాధారణ పరిశీలకులు నాగలక్ష్మి.ఎస్ ❖ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూనే నిబంధనల ప్రకారం సీజింగ్ చేపట్టాలి: వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్**
**❖కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సమగ్ర సమీక్ష**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల పరిశీలకులు మరియు జిల్లా యంత్రాంగం పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, ఏర్పాట్లపై నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, పోలీస్ మరియు సంబంధిత విభాగాల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు నాగ లక్ష్మి. ఎస్, వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ పాల్గొని అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సమీక్షా సమావేశంలో విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర. హెచ్.ఎం, డిసిసి కె.జి.వి సరిత, జెడ్.పి. సిఇఓ పి.సుశీల, డిపిఓ టి.సీతామహాలక్ష్మి, ఆర్డీవో వెన్నెల శ్రీను, మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.సాధారణ పరిశీలకులు నాగలక్ష్మి.



ఎస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళిపై క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలి.

సొంత నిర్ణయాలకు ఏమాత్రం తావులేకుండా ఎన్నికల ను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, వ్యయ పర్యవేక్షణ, క్షేత్రస్థాయి ఫిర్యాదులపై నియమించిన బృందాలు తక్షణమే స్పందించాలి. ఫిర్యాదుదారులకు సరైన సమాచారం అందిస్తూ విశ్వసనీయతను కాపాడాలి. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు సరైన శిక్షణ అందించడంతో పాటు పోలింగ్, కౌంటింగ్ సమయాల్లో వారికి రవాణా, నాణ్యమైన భోజనం, వసతి వంటి సౌకర్యాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలి. పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫెసిలిటేషన్ కేంద్రాల నిర్వహణ మరియు బ్యాలెట్ పత్రాల ముద్రణను నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలి.వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్స్ (FST), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (SST) వాహనాల తనిఖీలు నిర్వ హించే సమయంలో సాధారణ ప్రజలతో ఎంతో మర్యాదపూర్వకంగా, సంయమనంతో వ్యవహరించాలి. ఎక్కడైనా అక్రమాలు, నగదు, వస్తువులు పట్టుబడితే నిబంధనలకు అనుగుణంగానే పక్కా ఆధారాలతో సీజింగ్ చర్యలు చేపట్టాలి. నామినేషన్ల స్వీకరణ, ప్రచార నియమాలు, పోలింగ్ మరియు కౌంటింగ్ ప్రక్రియలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించాలి.ఎన్నికల ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లకు తావులే కుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మరియు పరిశీలకులు అధికారులను ఆదేశించారు.



## మహర్షి వాల్మీకి ఆదర్శాలు, రామాయణ సందేశం సమాజానికి నిత్యనూతనం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
మహాకావ్యం రామాయణాన్ని లోకానికి అందించిన ఆది కవి మహర్షి వాల్మీకి బోధనలు, జీవిత ఆదర్శాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్ చంద్ర, తదితరులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ దృఢ సంకల్పం, పరివర్తనతో సామాన్య వ్యక్తి కూడా మహర్షిగా మారవచ్చని వాల్మీకి తన జీవితం ద్వారా నిరూపించారని తెలిపారు. రామాయణం కేవలం ఒక పురాణ గ్రంథం మాత్రమే కాదని, మానవ విలువలు, కుటుంబ బాంధవ్యాలు, సమాజ హితాన్ని చాటిచెప్పే దివ్య ప్రబంధమని కొనియాడారు. రాముడి ద్వారా ఆదర్శ పాలన, ధర్మం, న్యాయం ఎలా ఉండాలో లోకానికి చూపిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అని, ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. నేటి యువత రామాయణంలోని సద్గుణాలను అలవర్చుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలు, న్యాయం వెల్లివిరియడానికి మహర్షి వాల్మీకి సూచించిన నైతిక విలువలు ఎంతో దోహదపడతాయని అన్నారు. తప్పులను సరిదిద్దుకుని సన్మార్గంలో పయనించవచ్చనే గొప్ప సందేశం వాల్మీకి జీవితంలో కనిపిస్తుందని చెప్పారు.నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ, వాల్మీకి సాహిత్యం సాంస్కృతిక వారసత్వానికి మూలస్తంభమని, రామాయణం ద్వారా అందించిన నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.నరసింహం, ఆర్డీవో వెన్నెల శ్రీను, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఘన స్వాగతం

**గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారుల ఆహ్వానం**



గన్నవరం, ప్రజాభూమి ప్రతినిధి :
ఎన్టీఆర్ జిల్లాలో పర్యటన నిమిత్తం సోమవారం ఉద యం వి జయ వాడ అంత ర్జాతీ య విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలి కారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు తదితరులు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.అనంతరం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



### ఘన వీడ్కోలు

**ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు..**



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
ఎన్టీఆర్ జిల్లాలో పర్యటన ముగించుకుని తిరుపతికి తిరుగు ప్రయాణమైన భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు సోమవారం మధ్యాహ్నం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.అదేవిధంగా రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి వీరపాండ్యన్, ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు తదితరులు ఉపరాష్ట్రపతికి ఘన వీడ్కోలు పలికారు.



# కూటమి అభ్యర్థులు అప్రతిహాత విజయాలు అందుకోవాలి

**❖అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ❖కొడాలిలో జడ్పీటీసీ అభ్యర్థి దోవారి పవిత్ర, ఎంపీటీసీ అభ్యర్థి తుమ్మల వరలక్ష్మిలకు మద్దతుగా ఇంటింటి ప్రచారం**



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
కూటమి అభ్యర్థులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అప్రతిహాత విజయాలు అందుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఘంటసాల మండలం కొడాలిలో ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు స్వగృహంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో కూట మి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూ టీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. వైసీపీ అస్థవ్యస్థ పాలనతో అంధకారంలో చేరిన రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం వెలుగునిచ్చిందన్నారు. వైసీపీ నిర్లక్ష్య పాలనతో అధ్వాన్న స్థితికి చేరిన గ్రామీణ రహదాలను కేంద్రం సహకారంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెచ్చిన నిధులతో పల్లెపండుగ 1,2,3 ద్వారా నియోజకవర్గంలో దాదాపు రూ.70-80 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు నిర్మించి గ్రామాల్లో మౌళిక సౌకర్యాలు మెరుగు పరిచినట్లు తెలిపారు. మరిన్ని నిధులు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయ న్నారు. నియోజకవర్గంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి పనులు ఔట్ ఫాల్ స్లూ యీజులు నిర్మాణం, కృష్ణానది కరకట్ట అభివృ ద్ధిపై సీఎం నిర్వహించిన కృష్ణాజిల్లా సమీక్షా సమావేశంలో, డిప్యూటీ సీఎం నిర్వహించిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో చర్చించి ఉన్నత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, తద్వారా ఆయా సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటోంద ని, ప్రజా దర్బార్ నిర్వ హించి ప్రజల నుంచి స మ స్యలు ఆహ్వా నించి ప రిష్కార ం చేస్తున్న ప్రభుత్వం ఇదే అన్నా రు.



ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పార్టీలకు అతీతంగా వైద్య ఖర్చులకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘంటసాల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న గుంటూరు బాపనయ్య మనుమరాలు, మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ కోడలు దోవారి పవిత్రకు జనసేన టికెట్ ఇచ్చే అవకాశం రావటం తమకు గర్వకారణం అన్నారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ఘంటసాల మండలంలో ఎస్సీలకు ఆమె పెద్ద దిక్కుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపీపీగా సేవ చేసేందుకు కొడాలి ఎంపీటీసీగా పోటీ చేస్తున్న తుమ్మల వరలక్ష్మి గతంలో ఎంపీపీగా, జడ్పిటి సిగా ఘంటసాల మండల అభివృద్ధిలో ప్రధానంగా ఈ మండలంలోని ఎస్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో తాను చేసిన కృషికి సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. వీరిద్దరి సారథ్యంలో ఘంటసాల మండలంలో నిరుపేదలకు మేలు కలుగుతుందని, మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఘంటసాల మండలం ప్రజలు కూటమి తరపున పోటీ చేస్తున్న ప్రతి ఒక్క అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి విక్కుర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోన రాజశేఖర్, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, డిసి వైస్ చైర్మన్ పరిసే చలపతి, ఏపీఎస్ ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, కూటమి నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, వేమూరి సాయి వెంకటరమణ, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాస్, యార్ల శ్రీకాంత్, పాటిబండ్ల నరేష్, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం గ్రామంలో కూటమి అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.





## వైభవంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి:
ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సోమవారం ఉదయం ఘనంగా జరిగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు, శ్రీ విఘ్నేశ్వరుడు,శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వంటి సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టమని పండిత ఉవాచ.ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా ప్రారంభంకాగా...ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.ధర్మ ప్రచారం నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయకోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్ణయించిన మార్గంలో సాగింది.ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి,కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాలప్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లోస్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు.గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేయడమైనది.వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, సూపరెండెంట్ హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఇందుపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామంలో రైతు శ్రీ కె. శ్రీరామ్ ప్రసాద్ గారు సాగు చేస్తున్న దేశీ వరి రకాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం న్యూయార్క్ బృందం సంద ర్శించింది. ఈ సందర్భంగా రైతు పొలంతో పాటు సమీకృత వ్యవసాయ విధానంలో పశువుల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్లు పెంపకం కూడా సందర్శించారు.ఈ క్షేత్ర సందర్శనలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డిపిఎం)కె. పార్థసారథి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, నేలకు అందించే ప్రకృతి వ్యవసాయ ఇన్పుట్ వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలు, వాటి వల్ల నేల సారవంతం పెరగడం, పంటల ఎదుగుదలకు కలిగే ప్రయోజనాలను బృందానికి వివరించారు.అనంతరం రైతుతో ముఖాముఖి చర్చించి, ఆయన వ్యవసాయ అనుభవాలు, ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న పద్ధతులు, ఎదురైన అనుభవాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ వై ఎస్ ఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ ప్రచారం

**మచిలీపట్నం 20వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించిన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ**



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
మచిలీపట్నం నగ రం లో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 20వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచార కా ర్య క్రమం నిర్వహించారు. మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా విజయాన్ని కాం క్షిస్తూ, 20వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి లోగిశెట్టి భార్గవి విజ యాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లోగిశెట్టి వెంకటస్వామితో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొని ప్రజలను కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇరువురు అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు.

## ఇంటింటి ప్రచారంలో కూటమి నేతలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ – 31వ డివిజన్ లో కూటమి తరపున మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాగుతున్న ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ, బీజేపి జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, జిల్లా/పట్టణ బిజేపీ నాయకులు పంతం వెంకట గజేంద్రరావులు పాల్గొన్నారు. కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా, 31వ డివిజన్ కూటమి అభ్యర్థి పంతం వెంకట మహాలక్ష్మిల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మరియు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. 31వ డివిజన్‌లోని ప్రతి వీధి, ఇల్లు తిరుగుతూ స్థానిక ప్రజలను కలిసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయంగా కూటమి అభ్యర్థులైన పంతం వెంకట మహాలక్ష్మి కి, మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబిదా కి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు ప్రజలను అభ్యర్థించారు.



ప్రజాభూమి
ఏలూరు, పశ్చిమగోదావరి 4
మంగళవారం 27 అక్టోబర్ 2026




### యువతకు ప్రాధాన్యతనివ్వాలి..

# హస్తం గుర్తుకు ఓటేయాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్రావు పిలుపు

**ప్రజాభూమి ఏలూరు**

నగర కార్పొరేషన్ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యతనిచ్చి, అభివృద్ధి సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్రావు నగర ప్రజలకు పిలుపునిచ్చారు.ఏలూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు యువతకు ప్రాధాన్యతనిస్తూ అభ్యర్థులను బరిలోకి దించినట్లు తెలిపారు.నగర మేయర్ అభ్యర్థి బురదగుంట లివిన్ క్రిస్టియన్‌కు మద్దతుగా హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు.చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ,యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా అవినీతిని అరికట్టి సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు.మేయర్ అభ్యర్థి బురదగుంట లివిన్ క్రిస్టియన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వస్తున్న మార్పుకు అనుగుణంగా ఏలూరు నగరంలోనూ మార్పు తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్య శర్మతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

### పేద పిల్లలకు

# విద్యను దూరం చేయొద్దు

- లోపూడి ప్రభుత్వ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి : ఏఐఎస్ఎఫ్



**ప్రజాభూమి ఏలూరు**

జిల్లాలోని ముసునూరు మండలం లోపూడి గ్రామంలోని హరిజనవాడలో గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఎంపీపీఎస్‌హెచ్‌డబ్ల్యూ ప్రభుత్వ పాఠశాలను తిరిగి యథావిధిగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశారు.2025 నుంచి పాఠశాలను మూసివేసిన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయలేదని, దీంతో విద్యార్థులు దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలను పునఃప్రారంభించి పేద విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు టౌన్ నాయకులు రోహిత్,వంశీ, సన్నీ,నాని,అభి పాల్గొన్నారు.

### కుయ్యేరులో విద్యుత్ షాక్‌తో

# జనసేన కార్యకర్త మృతి



**ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు**

కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చోడిశెట్టి వీర్రాజు (46) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఈమేరకు సోమవారం కుయ్యేరు గ్రామంలో మృతుడు స్వతహా తాపీమేస్త్రి కావడంతో సోమవారం తన విధినిర్వహణలో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురికావడంతో ఆయన మృతి చెందినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు.మృతునికి భార్య,ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.వీర్రాజు మృతితో కుయ్యేరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసును గొల్లపాలెం పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**జనసేన శ్రేణులు సంతాపం**

జనసేన పార్టీ కార్యకర్తగా మృతుడు వీర్రాజు తొలి నుంచి పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేసి మంచి వ్యక్తిగా గ్రామంలో మంచి పేరున్న వీర్రాజు అకస్మికంగా విద్యుత్ ఘాతానికి గురికావడంతో పలువురు జనసేన శ్రేణులు, అభిమానులు, తదితరులు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపి తమ ప్రగడ సానుభూతిని ఆ కుటుంబానికి తెలియజేసారు.

### ఏరియా ఆసుపత్రిలో జనసేన కార్యకర్త

# మృతదేహాన్ని సందర్శించిన మంత్రి సుభాష

- కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం

**ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం**

కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చోడిశెట్టి వీర్రాజు సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందడం పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ప్రమాదవ వార్త తెలియ



గానే రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించారు. ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మృతుని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడంతో మంత్రి సుభాస్ వీర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, మంత్రి సుభాస్ భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మంత్రి సుభాస్ వెంట కుయ్యేరు గ్రామానికి చెందిన పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

### పాలకొల్లు మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు

# రూ.16,000 విలువైన సేవ టీ-షర్టుల పంపిణీ

**ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు**

పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ పెద్ద కుమారుడు అల్లు వెంకటేష్ అల్లు వెంకటేశ్వర రావు మెమోరియల్ మున్సిపల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ మరియు మండల భవిత కేంద్రం నకుడాక్టర్ అల్లు రాధా కృష్ణ కుమారులు అల్లు వెంకట సత్యనారాయణ మరియు అల్లు తారక రామారావులు మరియు అల్లు వెంకట సత్యనారాయణ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు భవానీ ప్రసాద్ రాయపూడి ప్రోత్సాహంతో పట్టణంలోని మరియు యూనిఫాం టీ-షర్టులు బహుకరించారు. ఈ సేవా కార్యక్రమం ఈరోజు రెండు పాఠశాలల ఆవరణలో ఘనంగా జరిగింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జి.భాస్కరరావు, పి.సుబ్బాలక్ష్మీ మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పాలకొల్లు గడ్డపై పుట్టి నేడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర నిర్మాతగా వెలుగొందుతున్న అల్లు అరవింద్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల



చదువుకు, వారి ఆత్మవిశ్వాసానికి ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భవానీ ప్రసాద్ రాయపూడి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి టీ-షర్టులు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కొత్త టీ-షర్టులు అందుకున్న విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు.చివరగా పాఠశాల యాజమాన్యం దాతలకు, సహకరించిన డాక్టర్ అల్లు రాధా కృష్ణకి, భవానీ ప్రసాద్ రాయపూడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఏలూరు అభివృద్ధికి తనను గెలిపించండి

- ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థి పెరికే దినా గ్లాడి విజ్ఞప్తి

**ప్రజాభూమి ఏలూరు**

నగర అభివృద్ధి కోసం ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెరికే దినా గ్లాడి కోరారు.సోమవారం లంకపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ,మేయర్ పదవి బీసీలకు రిజర్వ్ అయినప్పటికీ బీసీ (సీ) వర్గానికి రాజకీయ పార్టీలు అవకాశం కల్పించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.గతంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించానని,కరోనా సమయంలో పెరికే ఫౌండేషన్ ద్వారా అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు అవకాశం కల్పిస్తే ఏలూరును గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు తాగునీటి సమస్య, డ్రైనేజీ



సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ టీం వ్యవస్థాపకులు బిషప్ కారుపాటి శాంతిసాగర్ మాట్లాడుతూ,బ్యాలెట్ పేపరులో 9వ నంబరులో ఉన్న కప్ అండ్ సాసర్ గుర్తుకు ఓటు వేసి పెరికే దినా గ్లాడిని గెలిపించాలని కోరారు. మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ ఏ.వి. పటేల్ మాట్లాడుతూ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెరికే వరప్రసాద్,డాక్టర్ వి. రాజేంద్రప్రసాద్, రెవరెండ్ బీరపోగు యోహాన్,తేళ్ల శ్యాంబాబు, పాస్టర్ పి.వి. రాజు, బేతేలు రమేష్ పాల్గొన్నారు.

# తాళ్లపూడి మండలంలో 41,882 మంది ఓటర్లు

- 54 పోలింగ్ కేంద్రాలు.. 15 ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఓటర్ల వివరాలు విడుదల

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**

తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు ఎంపీడీఓ అమ్మిరాజు వెల్లడించారు. 2026 సెప్టెంబర్ 8 నాటికి ఉన్న వివరాల ప్రకారం మండలంలో మొత్తం 41,882 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 20,507 మంది పురుషులు, 21,374 మంది మహిళలు, ఒకరు ఇతర కేటగిరీకి చెందిన ఓటరు ఉన్నారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 134 వార్డులు ఉండగా, ఓటర్ల కోసం 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నివేదికలో ఎంపీడీఓ పేర్కొన్నారు.

**అత్యధిక ఓటర్లు అన్నదేవరపేటలో..**

ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే తిరుగుడుమెట్ట ఎంపీటీసీ పరిధిలో 3,325 మంది, పెద్దేవం-1లో 3,241 మంది, పెద్దేవం-2లో 3,242 మంది, అన్నదేవరపేట-1లో 3,262 మంది, అన్నదేవరపేట-2లో 3,270 మంది ఓటర్లు ఉన్నారు. ప్రక్కిలంకలో 3,224 మంది, తాళ్లపూడి-1లో 2,835 మంది, తాళ్లపూడి-



2లో 2,846 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇక గజ్జరంలో 2,967 మంది, పోచవరంలో 2,436 మంది, వేగేశ్వరపురం-1లో 2,198 మంది, వేగేశ్వరపురం-2లో 2,210 మంది, మలకపల్లి-1లో 2,016 మంది, మలకపల్లి-2లో 2,023 మంది, తాడిపూడిలో 1,573 మంది, బల్లిపాడులో 1,214 మంది ఓటర్లు ఉన్నట్లు నివేదికలో వివరించారు. మండలవ్యాప్తంగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 867 మంది అధికంగా ఉన్నారు.



# దళిత సంఘాల నేతలతో ఎమ్మెల్యే బడేటి చంటి సమావేశం

**ప్రజాభూమి ఏలూరు**

నగరాభివృద్ధికి అందరినీ కలుపుకొని ఐక్యతతో ముందుకు సాగడమే తన లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. సోమవారం ఏలూరులోని ఓ హోటల్‌లో దళిత సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్,బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ నగరాభివృద్ధి,పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం అంశంపై అందరితో చర్చించి ముందుకు వెళ్తానని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.62 డివిజన్లలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో జనసేన సీనియర్ నాయకుడు బీవీ రాఘవయ్య చౌదరి, పలువురు దళిత సంఘాల నాయకులు దాసరి ఆంజనేయులు, లంకపల్లి మాణిక్యాలరావు,పొలిమేర హరికృష్ణ,మేతర అజయ్ దళిత నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలవేళ ఫ్లాగ్ మార్చ్

- సిఐ బి యాదగిరి



**ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో జాతీయ రహదారిపై సీఐ బి యాదగిరి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.యాదగిరి, ఎస్ఐలు క్రాంతి కుమార్, చెన్నారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చర్చి మొదటి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**

జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఆర్.సి.యం చర్చి మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సోదరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చర్చి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడింది. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తమ్మన సాంబశివరావు, కోర్స దుర్గారావు, పద్దం వెంకట కృష్ణ.చర్చి ఫాదర్లు, నిర్వాహకులు, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం 4వ వార్డులో వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం

- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముద్రగడ గిరిబాబు పిలుపు

**ప్రజా భూమి, ప్రత్తిపాడు (ఏలేశ్వరం), అక్టోబర్ 26**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం పురపాలక సంఘం 4వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 4వ వార్డులో బద్దిరెడ్డి గోవింద్‌తో కలిసి ముద్రగడ గిరిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బద్దిరెడ్డి ఆశాలత గోవింద్‌తో పాటు పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రస్తావిస్తూ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ముద్రగడ గిరిబాబు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బద్దిరెడ్డి ఆశాలత గోవింద్, దలే కిషోర్, జువ్విన వీర్రాజు, జువ్విన



రాఘవమ్మ, దత్తి రాజా తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు కాజులూరు విద్యార్థులు

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాజులూరు విద్యార్థులు కాకినాడలో జరిగిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2026 లో నలుగురు విద్యార్థులు మమతశ్రీ, కుసుమ దుర్గ, లహరి, నరసింహ నాయుడు త్వరలో హైదరాబాద్ లో జరగబోయే జాతీయ స్థాయి అథెలిటిక్స్ లో పాల్గొనబోతుట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పాఠశాల నుండి వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులలో దాదాపు 50 మందికి పైగా విద్యార్థులు జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో పాల్గొని మెరుగైన ప్రతిభ కనబరచారని అలాగే ఈ నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు తద్వారా గ్రామానికి గర్వకారణమని తెలియజేశారు. ఈ విజయం తమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గరగ నాగమణి దేవి, బుద్దాల మణికంఠ , కొండయ్యపాలెపు గౌతమీ సుధలదే అని అన్నారు. వీరు అహర్నిశలు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నారని ప్రశంసించారు. నలుగురు విద్యార్థులతో పాటు పి. మమత, ఎస్ కార్తికేయ మరియు అనుష్కలు స్కూల్ గేమ్స్ పెడరేషన్ క్రీడల్లో భాగంగా బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలియజేశారు. విజేతలైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్ మిగిలిన ఉపాధ్యాయులు అభినందించి జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



## జిల్లా కలెక్టర్ కార్యాలయంలో
# వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

మహర్షి వాల్మీకి జయంతిని కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కె. వెట్రిసెల్వి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రత్నాకరుడు అనే బోయవానిగా ఉండేవారని, నారద మహర్షి ఉపదేశంతో రామ తారక మంత్రం జపించి తపస్సు చేశారన్నారు. సంస్కృత సాహిత్యంలో తొలి కావ్యానమైన శ్రీమద్ రామాయణాన్ని 24,000 శ్లోకాలతో మహర్షి వాల్మీకి రచించారన్నారు. వాల్మీకి మహర్షి సీతాదేవికి తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించి లవకుశులను పెంచి విద్యాబుద్ధులు నేర్పారన్నారు. మహర్షి వాల్మీకి జ యంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి,, ఇంచార్జ డిఆర్ఓ ఎం. ముక్కంటి, ఎస్డిసి దేవకీదేవి, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విశ్వమోహన్ రెడ్డి, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, గృహనిర్మాణ శాఖాధికారి సత్యనారాయణ, పర్యాటక శాఖాధికారి పట్టాభిరామయ్య, ఆర్టీఓ శేఖర్, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, ఆర్టీసీ ఆర్ ఎం షబ్నమ్, కలెక్టరేట్ సిబ్బంది ప్రభృతులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం ఎన్నికల బరిలో బీఎస్పీ

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట



ఆత్రేయపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ రాజకీయ ఉనికిని చాటుకునేందుకు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎన్నికల బరిలోకి దిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం జెడ్పీటీసీ స్థానంతో పాటు ర్యాలి ఎంపీటీసీ-2 స్థానానికి బీఎస్పీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్రేయపురం జెడ్పీటీసీ స్థానానికి బీఎస్పీ తరపున యాళ్ల వీరన్నబాబు నామినేషన్ దాఖలు చేయగా, ర్యాలి ఎంపీటీసీ-2 స్థానానికి చిగురుపాటి సుభాష్ నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వీరన్నబాబు, సుభాష్ మాట్లాడుతూ.. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం ఆశయాలే తమకు మార్గదర్శకమని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములను పక్కనపెట్టి ప్రజల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే స్థాయిలో బహుజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు బీఎస్పీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు రాజ్యాంగ హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక సాధికారత కోసం పార్టీ పనిచేస్తోందన్నారు. స్థానిక సంస్థలు ప్రజలకు అత్యంత చేరువైన పాలనా వ్యవస్థలని, గ్రామస్థాయిలోనే బహుజన వర్గాలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. తమ అభ్యర్థులను గెలిపించడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీఎస్పీ ఏనుగు గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలు, ప్రజల హక్కులు, బహుజన వర్గాల సంక్షేమమే ప్రధాన అజెండాగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం తృతీయ వార్షికోత్సవం



- 'వైశ్వకర్మణ హోమము' గ్రంథావిష్కరణ..
- ముఖ్య అతిథిగా తెలంగాణ ఏసీపీ కె.ఎం. కిరణ్ కుమార్

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం తృతీయ వార్షికోత్సవం ఏలూరులోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఘనంగా జరిగింది. ధర్మపీఠం సభాపతి ఆచార్య చంద్రపాటి నాగవరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వేదప్రమాణాలతో రూపొందించిన 'వైశ్వకర్మణ హోమము' గ్రంథాన్ని, ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర క్రైమ్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.ఎం. కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ధర్మపీఠం సంచాలకులు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి సంకలనం చేసిన 'చిత్ర సౌరభాలు' కవితా సంపుటిని సైతం ఆయన ఆవిష్కరించారు.

**పూర్ణకుంభ స్వాగతం.. వైభవంగా ప్రారంభ వేడుకలు**

కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి కిరణ్ కుమార్‌కు ధర్మపీఠం వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ధర్మపీఠం గౌరవ సలహాదారు కూర్మాచార్యులు విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించగా, ఉపసభాపతి దాసరోజు శ్రీనివాసరావు, సంచాలకులు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి, స్వరాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉపసభాపతి కౌలూరి కృష్ణ వరప్రసాద్ శర్మ, ముంగండ శ్రీనివాసశర్మ, కె. బ్రహ్మాజీ తదితర వేదపండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవ్యశ్రీ నాట్యబృందం చిన్నారులు ప్రదర్శించిన స్వాగత నృత్యం సభికులను ఆకట్టుకుంది.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతే ధర్మపీఠం లక్ష్యం: ఏసీపీ కిరణ్ కుమార్

ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె.ఎం. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, 1974లో తన తాతగారైన కీర్తిశేషులు ఎర్రోజు మాధవాచార్యులు సభాపతిగా విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి, వైదిక ధర్మ పరిరక్షణ, విశ్వబ్రాహ్మణ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా విశ్వబ్రాహ్మణ ధర్మపీఠాన్ని స్థాపించారని గుర్తుచేశారు. ఆ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తాను విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్‌ను స్థాపించి, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి, ఔన్నత్యం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేదప్రమాణాలతో రూపొందిన విశిష్ట గ్రంథం 'వైశ్వకర్మణ హోమము' ధర్మపీఠం ఉపసభాపతి, గ్రంథ సంపాదకులు తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు మాట్లాడుతూ, సభాపతి ఆచార్య చంద్రపాటి నాగవరప్రసాదరావు వేదమూలాలను పరిశోధించి, పండితుల సహకారంతో 'వైశ్వకర్మణ హోమము' గ్రంథాన్ని రూపొందించినట్లు వివరించారు. బ్రహ్మహత్యా పాతకం నుంచి విముక్తి పొంది, విశ్వకర్మ పరమాత్మ అనుగ్రహాన్ని పొందేందుకు దేవేంద్రుడు ఈ హోమాన్ని నిర్వహించినట్లు గ్రంథంలో వివరించారని తెలిపారు. మానవులు పాపకర్మల నుంచి విముక్తి పొంది, ధర్మబద్ధమైన కోరికల సాధనకు పరమాత్మ అనుగ్రహాన్ని పొందే ఆధ్యాత్మిక మార్గంగా ఈ హోమం ప్రాధాన్యాన్ని వివరించారు. హోమ విధివిధానాలతో పాటు విశ్వకర్మ పరమాత్మ సృష్టిక్రమం తదితర అంశాలను వేదప్రామాణికంగా ఈ గ్రంథంలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

**వేదవిద్య, బ్రహ్మవిద్యను చేరువ చేయడమే ధర్మపీఠం సంకల్పం: శివశ్రీ**

ధర్మపీఠం ప్రధాన సంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) మాట్లాడుతూ, జ్ఞాన, విజ్ఞాన సంప్రదాయాలకు వారసులైన విశ్వబ్రాహ్మణులు కాలక్రమంలో వృత్తిపరమైన గుర్తింపుకే పరిమితమై, తమ ప్రాచీన వైదిక, ఆధ్యాత్మిక వారసత్వానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణుల పూర్వ ఔన్నత్యాన్ని పునరుద్ధరించాలనే సంకల్పంతో విశ్వబ్రాహ్మణ పండిత త్రయంగా ప్రసిద్ధులైన కీర్తిశేషులు ఎర్రోజు మాధవాచార్యులు, కొండూరు వీరరాఘవాచార్యులు, దురిసేటి వెంకట రామాచార్యులు అర్ధశతాబ్దం క్రితమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ధర్మపీఠాన్ని స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎర్రోజు మాధవాచార్యులు విశ్వబ్రాహ్మణుల పూర్వ వైభవ పునరుద్ధరణతో పాటు జాతీయోద్యమంలోనూ భాగస్వాములయ్యారని తెలిపారు. కొండూరు వీరరాఘవాచార్యులు యోగవిద్యకు సంబంధించిన 'అంతర్యాగము' అంశంపై వేదప్రామాణికంగా గ్రంథరచన చేశారని, దురిసేటి వెంకట రామాచార్యులు మధువిద్యకు విశ్వబ్రాహ్మణుల వారసత్వ సంబంధాన్ని వేదోపనిషత్తుల ఆధారంగా వివరించే గ్రంథాలను రచించారని పేర్కొన్నారు. ఆ మహనీయుల ఆశయాలను కొనసాగించాలనే లక్ష్యంతో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ధర్మపీఠాన్ని పునర్నిర్మించి, వేదాధ్యయన పండితులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సమాజానికి దూరమైన వేదవిద్య, బ్రహ్మవిద్యలను తిరిగి చేరువ చేయడం, ప్రాచీన జ్ఞాన సంపదను భావితరాలకు అందించడం ధర్మపీఠం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**ధర్మపీఠం కార్యక్రమాల నివేదిక.. నూతన నియామకాలు**

ధర్మపీఠం కోశాధికారి పెంట శివప్రసాద్ సంస్థ చేపట్టిన కార్యక్రమాల నివేదికను వివరించారు. సంస్థాగత విస్తరణలో భాగంగా పలు జిల్లాలకు కన్వీనర్లను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

**జిల్లాల కన్వీనర్లు:**

విజయనగరం జిల్లా: పాలకొల్లు రామారావు
విశాఖపట్నం జిల్లా: కొండేపు శ్రీ వెంకట గణేష్ బాబు
గుంటూరు జిల్లా: కందుకూరి సుధాకర్ బాబు
రాష్ట్ర మహిళా విభాగం నియామకాలు:
కన్వీనర్: పతకమూరి విజయలక్ష్మి
కో-కన్వీనర్లు: డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి, కోడూరు త్రిపుర రాజేశ్వరి

ఈ నియామకాల ద్వారా ధర్మపీఠం కార్యక్రమాలను జిల్లాస్థాయికి విస్తరించి, మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**పలువురు ప్రముఖుల పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఎన్నికల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ధనాలకోట వాసు, విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ సభ్యులు పెంట శ్రీనివాసరావు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ జోనల్ చైర్మన్ కాదా రాంబాబు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పొట్నూరు శివరావు, కార్యదర్శి కెల్ల దుర్గాప్రసాద్, కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రం చైర్మన్ యలబాక కృష్ణ, విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు లక్కోజు వెంకటేశ్వరరావు (కొండబాబు), ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు బొద్దురి నాగభూషణం, కార్యదర్శి చిట్టూరి త్రినాథ్, జేఏసీ కార్యదర్శి అనుపోజు త్రినాథ్, జంగారెడ్డిగూడెం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు లకణవరపు భోగేశ్వరరావు, ఏలూరు బ్రహ్మంగారి ఆలయ కార్యదర్శి ముశినాడ శేఖర్. భీమవరం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీశైలపు నాగబాబు, కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తుపాకుల సోమాచార్యులు, రామునిగట్టు విశ్వకర్మ పరమాత్మ ఆలయ వ్యవస్థాపకులు పుల్లూరి సోమశేఖరాచార్యులు, ఏలూరు విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కొక్కొండ బ్రహ్మం, తుంపాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేదవిద్యా పరిరక్షణ, వైశ్వకర్మణ హోమ విధాన ప్రచారం, విశ్వబ్రాహ్మణుల సాంస్కృతిక పునరుజ్జీవనం, సంస్థాగత విస్తరణ లక్ష్యాలతో జరిగిన ఈ వార్షికోత్సవం ధర్మపీఠం భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసింది.





# ఏలూరులో కూటమి నేతల విస్తృత ఎన్నికల ప్రచారం..

- అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపు

ప్రజాభూమి ఏలూరు

నియోజకవర్గంలోని పలు డివిజన్లలో కూటమి నాయకులు సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 43, 55వ డివిజన్ల పరిధిలోని మంచినీళ్ల తోట, బ్రహ్మంగారి గుడి,రాణినగర్ ప్రాంతాల్లో జిల్లా టీడీపీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి ఘన స్వాగతం పలకగా,మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరానికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు,ఆదరణే తమ బలమని అన్నారు. ప్రచారంలో భాగంగా నాయకులు స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు,అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నారా శేషు,శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్,టీడీపీ టౌన్ అధ్యక్షుడు చోడే వెంకటరత్నం,మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి,జనసేన నగర అధ్యక్షుడు వీరంకి పండు, మాజీ ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్,టీడీపీ నాయకులు ఎం.ఆర్.డి. బలరాం,రెడ్డి నాగరాజు, కార్పొరేటర్ అభ్యర్థులు బాడిశెట్టి శ్రీనివాస్, వందనాల దుర్గాభవాని పాల్గొన్నారు.

# వ్యాక్సిన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా వాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఐ ఎల్ ఆర్ లో వ్యాక్సిన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని మాన్యుఫ్యాక్చరింగ్ డేటు. ఎక్స్పైరీ డేట్ చూసు కుని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి అందజేయాలని. అలాగే వ్యాక్సిన్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ తెలియజేయాలని స్టాఫ్ నర్స్ కు తెలిపారు. ఏ ఎన్ ఎం లు వ్యాక్సినేషన్ చేసే ముందు వ్యాక్సిన్ ఒకసారి పరిశీలించి స్టాక్ ఎంట్రీ వేసుకుని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ప్రసాద్ రావు. డాక్టర్ నవ్య జీవన్. ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పి హెచ్ ఎన్ పి ఎలిజిబెత్. సూపర్వైజర్ గంగాభవాని. స్టాఫ్ నర్స్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# తుఫానుపై అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు తహసీల్దార్ లక్ష్మి లావణ్య హెచ్చరిక.. 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తుఫాను ప్రభావం తాళ్లపూడి మండలంపై కూడా ఉండే అవకాశం ఉన్నందున మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మి లావణ్య సూచించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు దండోరా వేయిస్తున్న ట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రం లేదా నదిలోకి వెళ్లవద్దని, ప్రజలు గోదావరి ఘాట్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా పంటలు, నివాసాలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 9491021431 తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మి లావణ్య కోరారు.

# శ్రీ మహర్షి వాల్మీకికి ఘన నివాళులు..

**- : అనంతపురం కలెక్టరేట్ లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, తదితరులు..**



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
శ్రీ మహర్షి వాల్మీకి జయంతోత్సవం సందర్భంగా సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శ్రీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ మానవాళికి రామాయణం లాంటి ఒక మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి ప్రపంచానికి ఇచ్చినటువంటి రామాయణం గ్రంథం అనేక సంవత్సరాల తర్వాత కూడా మానవ జీవన మార్గదర్శకానికి ఉపయోగపడుతోందన్నారు. ఆయన చూపిన బాటలో మనమందరం నడవాలన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం, బిసి వెల్ఫేర్ హెచ్డబ్ల్యుఓ మస్తాన్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శింగనమల ఆత్మ రామాలయంలో వాల్మీకి మహర్షి జయంతి ప్రత్యేక పూజలు



ప్రజా భూమి శింగనమల
శింగనమల: మండల కేంద్రం లో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని శ్రీ ఆత్మ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వాల్మీకి మహర్షికి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి అందించిన రామాయణ మహాకావ్యం సమాజానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను బోధిస్తోందని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యం. ఆదినారాయణ, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ,స్ఫూర్తిదాయకమనిఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. వాల్మీకి మహర్షి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జయంతి వేడుకలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని తెలిపారు.

## నార్పలలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు**



ప్రజాభూమి - నార్పల
నార్పల మండల కేంద్రంలోని కూతలేరు వంక సమీపంలో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు, యువకులు మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితాన్ని, ఆయన అందించిన సందేశాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సంఘం ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు-ప్రజా సమస్యలే ఎజెండా..

**-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



గతంలో జగనన్న పాలనలో అమలైన సంక్షేమ పథకాలను, ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా, వార్డుల అభివృద్ధే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి షాజియాతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను నేరుగా కలుసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. రోడ్షోలో భాగంగా వివిధ వార్డుల్లో పర్యటించిన దీపిక వేణురెడ్డి, షాజియా స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరత, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గతంలో ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై స్థానికులతో చర్చించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు వార్డులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ అభ్యర్థులు కృషి చేస్తారని వివరించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, పేదలకు అందించిన ఆర్థిక సహాయం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించే నాయకత్వాన్ని ఆదరించాలని కోరారు. మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడం తమ అభ్యర్థుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రచార కార్యక్రమానికి స్థానికుల నుంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. చైర్పర్సన్ అభ్యర్థి షాజియాతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు నందిని, అయిషా, నాగరాజు, పవిత్రతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్లూరు మండల ప్రజా పరిషత్ లో నామినేషన్ల ఉపసంహరణ.

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ మొదలైంది. కుమ్మనమలకు చెందిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి హిమకుంట్ల రాజమ్మ , అలాగే కంది కాపులకు చెందిన తెలుగుదేశం అభ్యర్థి చింతకుంట సాంబశివారెడ్డి వీరిద్దరూ నామినేషన్లు ఉపసంహరించినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు మరో రెండు రోజులు గడువు ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# టీడీపీ, వైసీపీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్టే....

**-రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేశాయి.. -ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ అవసరం**
**-ఊసే లేని ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ**
**-పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ప్రతినిధి తులసిరెడ్డి తీవ్ర విమర్శలు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్
టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్టేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించకుండా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్కు అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించాల్సిన రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థ ఎన్నికలుగా మాత్రమే చూడకూడదని, ప్రజాస్వామ్య విలువలు, రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల హక్కులకు సంబంధించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సోమవారం హిందూపురం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్య మనుగడపై ఆందోళన కలిగిస్తున్నాయని తులసిరెడ్డి పేర్కొన్నారు. అధికార టీడీపీ కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ రెండు పార్టీలకు ఓటు వేయడం ద్వారా బీజేపీకి రాజకీయంగా మద్దతు ఇచ్చినట్టవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాజకీయ పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి అవకాశాలు, విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత రాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో పార్టీ రాజకీయాలకు అతీతంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు స్థానిక రాజకీయాలకే పరిమితం కావని, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా చర్చకు దారితీస్తాయని తులసిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రజలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం కల్పిస్తాయని, ఆ అవకాశాన్ని వినియోగించుకునే ముందు అభ్యర్థులు, రాజకీయ పార్టీల విధానాలు, గతంలో చేసిన వాగ్దానాలు, ప్రజా సమస్యలపై వాటి వైఖరిని పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకంటే ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు జవాబుదారీతనం ముఖ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉందని తులసిరెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్గాంధీ వంటి నాయకుల త్యాగాలను ప్రస్తావిస్తూ దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను వివరించారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడం, మత సామరస్యాన్ని కాపాడటం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని అన్నారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో పట్టణ అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సమావేశంలో ప్రస్తావించారు. స్థానిక సంస్థలు ప్రజలకు చేరువగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయని పేర్కొన్నారు. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే పాలన అవసరమన్నారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా అమానుల్లా పోటీ చేస్తున్నారని తులసిరెడ్డి తెలిపారు. పార్టీ తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు కూడా ప్రజల ముందుకు వెళ్లి తమ అభిప్రాయాలను వివరిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు, పట్టణ అభివృద్ధి వంటి అంశాలు ఎన్నికల చర్చలో ప్రాధాన్యత పొందాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అమానుల్లా, జమీల్, శ్యామ్కుమార్, ఇతర నాయకులు, పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

**-బ్యాలెట్ బాక్సుల పంపిణీ నుంచి కౌంటింగ్ వరకు పక్కా ఏర్పాట్లు చేయాలి**
**-అధికారులకు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాలు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల పంపిణీ, పోలింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్కు తరలించడం, భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భద్రత, సమన్వయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్తో కలిసి సోమవారం హిందూపురం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎంజీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను, పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్తో పాటు కౌంటింగ్ హాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంజీఎం పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది విధుల కేటాయింపు, సామాగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పంపిణీ కేంద్రంలో రద్దీ లేకుండా, విధులు సక్రమంగా నిర్వహించేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్వీకరించడం, వాటిని సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్కు తరలించడం, భద్రపరిచే సమయంలో పాటించాల్సిన విధివిధానాలపై ఆరా తీశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, అధికారులు, సిబ్బందికి విధులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. కౌంటింగ్ హాళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది విధుల నిర్వహణకు అనువైన వసతులు, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఎన్నికల అధికారి మల్లికార్జునకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రాదేశిక ఎన్నికల ఏర్పాట్లపైనా కలెక్టర్ వివరాలు వెల్లడించారు. హిందూపురం నియోజకవర్గ పరిధిలోని ఆయా మండల కేంద్రాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మున్సిపల్, ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను సమయానికి పూర్తి చేసి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, డీఎస్పీ రవి బాబు, వన్టౌన్ సీఐ ప్రసాద్ బాబు, టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ సత్తార్, ఎంపీడీవో దామోదరమ్మ రెవెన్యూ ఇన్స్ పెక్టర్ అమరేంద్ర, మండల సర్వేయర్ సురేష్ తో పాటు సంబంధిత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**-ఎమ్మెల్యే బాలకృష్ణ స్ఫూర్తితో పట్టణాభివృద్ధికి చర్యలు -కూటమి చైర్మన్ అభ్యర్థి ప్రచారానికి అనూహ్య స్పందన**



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మంజునాథ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్ఫూర్తితో పట్టణాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్, ముక్కిడి పేటలలో పర్యటించారు. ఈ సందర్భంగా మంజునాథ్ కు ఆయా ప్రాంతాల్లో అనూహ్య స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లో చైర్మన్ అభ్యర్థికి క్రేన్ తో గజమాల తో స్వాగతం పలికారు. దీనికి తోడు మహిళలు నుదుట తిలకం దిద్ది మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా మంజునాథ్ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంజునాథ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మంజునాథ్ మాట్లాడుతూ, ఇప్పటికే హిందూపురం పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వందల కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయని, వీటికి తోడు మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే సహకారంతో హిందూపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులను కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళతానని మంజునాథ్ తెలిపారు. తనతోపాటు కూటమి అభ్యర్థులుగా పోటీ షాక్ చేస్తున్న వారందరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు పాటు. ప్రజలకు అభివాదం చేస్తూ మంజునాథ్ ఆయా ప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేసింది. ఆయా కార్యక్రమంలో మంగేష్, మహబూబ్ బాషా, భాస్కర్, డైమండ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు




ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురము
అనంతపురం నగరంలోని రుద్రంపేట వాల్మీకి కళ్యాణ మండపంలో సోమవారం వాల్మీకి సోదరులు మరియు సంఘం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాల్లో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం పాత ఊరిలోని పవర్ ఆఫీస్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని, సమాజానికి ఆయన అందించిన అమూల్యమైన సందేశాలను వివరించారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, మన సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్య, ఉద్యోగ, వ్యాపార, సామాజిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ముఖ్యంగా మన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, మంచి విలువలు, క్రమశిక్షణతో కూడిన అలవాట్లను పెంపొందించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో, నగరాల్లో వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని విస్తృతంగా చాటిచెప్పి, భావితరాలకు ఆయన జీవిత సందేశాలను అందించాలన్నారు. వాల్మీకి సోదర సోదరీమణుల అభ్యున్నతికి, వారి విద్యా, సామాజిక, ఆర్థిక పురోగతికి మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బి.ఆర్. ఈశ్వర్, రిటైర్డ్ సీటీఓ బి.ఆర్. ప్రసాద్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ డి. నరహరి, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.వి. రామకృష్ణ, డి.ఎస్. ఆనందరారు, చార్టర్డ్ అకౌంటెంట్ హరిచంద్రరామ, రిటైర్డ్ ఆర్ఎం బి రంగన్న, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులుతో పాటు వాల్మీకి సంఘం నాయకులు, ఉద్యోగులు, ఇతర అధికారులు, వాల్మీకి సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ జట్లకు ఎంపికైన పులివెందుల క్రీడాకారులు

### ఒకే అకాడమీ.. ఒకే కోచ్.. ముగ్గురికి జిల్లా జట్లలో చోటు



ప్రజాభూమి,పులివెందుల

కడపలో నిర్వహించిన పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపికల్లో పులివెందుల ప్రాంతానికి చెందిన ముగ్గురు యువ క్రీడాకారులు ప్రతిభ చాటారు. రాయలసీమ క్రికెట్ అకాడమీలో కోచ్ నిత్యానంద రెడ్డి మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతు న్న ఈ ముగ్గురు క్రీడాకారులు అండర్-17, అండర్-14 జిల్లా జట్లకు ఎంపికయ్యారు.

అండర్-17 జట్టుకు మహేంద్ర - పులివెందుల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బూచిపల్లి రఘునాథ్, వెంకటేశ్వరి దంపతుల కుమారుడు బూచిపల్లి మహేంద్ర అండర్-17 జిల్లా క్రికెట్ జట్టుకు ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు. భవిష్యత్తులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని మహేంద్ర తెలిపాడు. అండర్-14 జట్టుకు కుశాల్ యాదవ్ -పులివెందుల పట్టణానికి చెందిన వేల్పుల గంగాధర్ యాదవ్, లక్ష్మి యాదవ్ దంపతుల కుమారుడు కుశాల్ యాదవ్ అండర్-14 జిల్లా జట్టుకు ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు. భవిష్యత్తులో భారత క్రికెట్ జట్టుకు ఆడాలని ఆకాంక్షిస్తున్నట్లు కుశాల్ తెలిపాడు. అండర్-14 జట్టుకు సుదీపు రెడ్డి -పెద్దముడియం మండలం ఉలవపల్లి గ్రామానికి చెందిన ముడిమేల సుభాష్ రెడ్డి, వెంకటేశ్వరి దంపతుల కుమారుడు ముడిమేల సుదీపు రెడ్డి అండర్-14 జిల్లా జట్టుకు బ్యాట్స్‌మన్‌గా ఎంపికయ్యాడు. భవిష్యత్తులో ఐపీఎల్‌లో ఆడటమే తన లక్ష్యమని సుదీపు రెడ్డి తెలిపారు. ఒకే క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందిన ముగ్గురు క్రీడాకారులు జిల్లా జట్లకు ఎంపిక కావడంపై వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు, పులివెందుల ప్రాంత క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కోచ్ నిత్యానంద రెడ్డి మార్గదర్శకత్వంలో మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## లింగాలలో టీడీపీ ప్రచార జోరు - జెడ్పీటీసీ స్థానం కైవసమే లక్ష్యం

### సరళాదేవి గెలుపే ధ్యేయంగా కోమన్నూతలలో ఇంటింటా ప్రచారం చేసిన టీడీపీ శ్రేణులు



ప్రజాభూమి, పులివెందుల:

పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ విజయ పరంపరను కొనసాగించ డమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.లింగాల మండల జెడ్పీటీసీ అభ్యర్థి ఎమ్మనూరు సరళా దేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేత, క్లస్టర్ ఇంచార్జ మారెడ్డి జయభరత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి ఆధ్వర్యంలో లింగాల మండలంలోని కోమన్నూతల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ప్రజలను నేరుగా కలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టీడీపీ అభ్యర్థికి ఎందుకు మద్దతు ఇవ్వాలో ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ స్థానిక పరిస్థితులపై ఆరా తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. పులివెందుల నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణను తమకు అనుకూలంగా మలుచుకుంటూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. సరళాదేవి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పులివెందులలో ఎన్నికల ప్రచారం

### సైకిల్ గుర్తుకు రెండు ఓట్లు వేయండి మారెడ్డి లతా రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీత కుమారి, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి పులివెందుల మున్సిపాలిటీ లోని 20వ వార్డులో కూటమి కౌన్సిలర్ అభ్యర్థి మునివర్ధన్ యాదవ్ ను మద్దతుగా ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకుంటూ వచ్చిందన్నారు. పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. చైర్మన్ అభ్యర్థిగా తుగుట్ల గీతా కుమారిని కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. బీటెక్ రవి నాయకత్వంలో పులివెందుల అభివృద్ధి చెందుతుందని వైకాపా నుండి టిడిపిలోకి వలసలు రావడం జరుగుతుందన్నారు.

## ట్రిపుల్ జంప్‌లో రాష్ట్రస్థాయికి విద్యార్థిని

### - యజ్ఞేశ్వరికి రూ.3 వేల నగదు ప్రోత్సాహక బహుమతి

ప్రజాభూమి, వేంపల్లె

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అండర్-17 విద్యార్థిని ఏ. యజ్ఞేశ్వరి ట్రిపుల్ జంప్ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 24న జరిగిన ఎంపిక పోటీల్లో ఆమె ప్రతిభ చాటడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. సంజీవరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్. రసూల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. విద్యార్థినిని ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున రూ.2 వేలు, ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ రెడ్డి రూ.వెయ్యి నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. మొత్తం రూ.3 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందించి యజ్ఞేశ్వరిని ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి గ్రామానికి, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థినికి సూచించారు.




## పులివెందులలో ముమ్మరంగా వైకాపా నాయకుల ఇంటింటి ప్రచారం

### ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించండి

### - వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల:

మీ అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మను, మీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైకాపా ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డిలు పిలుపునిచ్చారు.పట్టణంలోని 24వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి కుప్పల ప్రభావతితో కలిసి చిన్న కొండప్ప కాలనీ, బేతేలు చర్చి తదితర ప్రాంతాలలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ఓటర్లను తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి వైకాపా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటే మున్సిపల్ పీఠాన్ని వైకాపా దక్కించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి జరిగింది అంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అని అన్నారు.కూటమి నాయకులు ఎన్నో కుట్రలు పన్నుతున్నారని, వాటిని లెక్కచేయకుండా జరిగే ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. గతంలో వైఎస్ ప్రమీలమ్మ మున్సిపల్ చైర్మన్ గా పనిచేశారని, ఆమెకు పులివెందులపై ఎంతో పట్టు ఉందని, మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అంతకుముందుగా వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని వీరారెడ్డి, స్టేట్ వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కొంగనపల్లి విజయ్ కుమార్, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ గుర్తుకు రెండు ఓట్లేసి అభివృద్ధికి పట్టం కట్టండి

### 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అంబకపల్లి మునయ్య



ప్రజాభూమి, పులివెందుల:

జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కౌన్సిలర్ అభ్యర్థి అంబకపల్లి మునయ్య ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం టీడీపీ నాయకులతో కలిసి వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి పాంప్లెట్లు పంపిణీ చేస్తూ, టీడీపీ సైకిల్ గుర్తుపై చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారికి, కౌన్సిలర్ అభ్యర్థిగా తనకు రెండు ఓట్లు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా మునయ్య మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధి కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పులివెందుల అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో ఎర్రగుడిపల్లెలో రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి గంగాధర్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన




ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. సహదేవ రెడ్డి, కడప కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా. సునీల్, వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డా. శ్రీనివాసచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిపుణులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యాన పంటల సాగు, తెగుళ్లు, పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిం చడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. పంటల ఎంపిక, సమగ్ర పంటల నిర్వహణపై పలు సలహాలు అందించారు.కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు వివిధ పంటల నమూనాలు, వ్యవసాయ పనిముట్లు, జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేయడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అధ్యాపకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. లీలావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. సి. ప్రత్యూష, డా. జి. నారాయణస్వామి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. మహేష్ (విస్తరణ), డా. మానస (ఉద్యానవన శాఖ) విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల పోలింగ్ నేపథ్యంలో పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్

**–శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి**

**- సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి**

**- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్...**




ప్రజాభూమి, - కడప క్రైం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎపోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ గస్తీ, ఫుట్ పెట్రోలింగ్, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడంవంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై నిరంతరం నిఘా ఉంచాలని, సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి చట్టపరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి స్పష్టమైన బాధ్యతలు కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సరిహద్దు చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, నగదు, మద్యం, ఇతర అక్రమ రవాణాలపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు,అడిషనల్ ఎస్పీఎ.ఆర్.బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్పీఎన్. సుధాకర్, ఎ.ఆర్ డి.ఎస్పీ నాగేశ్వరరావు, కడప డి.ఎస్పీ టి.భవాని, జిల్లా లోని సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## సిద్ధవటంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సచివాలయ ఉద్యోగులతో సమావేశం



ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక సంస్థల ఎన్నికల విధులను ఉద్యోగులు అత్యంత బాధ్యతాయు తంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య సూచించారు. స్థానిక మండల కేంద్రంలోని ఎంపీడీవో సభా భవనం లో సోమవారం సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిబంధ నలను కచ్చితంగా అమలు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అలాగే, 11 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3:00 గంటలలోపు 'ఫారం-బి'ని విధిగా సమర్పించాలని స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, మండల తహశీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ ప్రసాద్, ఏపీవో నరసింహులు మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### - ఇంచార్జ్ ఈఓపీడీ శ్రీనివాసులు



ప్రజాభూమి, సిద్ధవటం:

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఇంచార్జ్ పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని భాకరాపేట గ్రామ సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిట్టపల్లి గ్రామంలో రహదారి ఇరువైపులా పేరుకుపోయిన అపరిశుభ్రతను తొలగించి, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయడం జరిగిందని తెలిపారు. భాకరాపేట, శివునిపల్లి, పేరయ్య గారి పల్లి, మిట్టపల్లి, గాంధీనగర్, రామస్వామి పల్లె, బెటాలియన్ ప్రాంతాల ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను మురికి కాలువల్లో వేయరాదని హెచ్చరించారు. దీనివల్ల డ్రైనేజీ వ్యవస్థ స్తంభించి, విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తిరిగే గ్రీన్ అంబాసిడర్,చెత్త సేకరణ వాహనంలోనే ప్రతి ఒక్కరూ చెత్తను వేసి, గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడంలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంపై టిడిపి సమీక్ష

**- ప్రచార నిర్వహణ, గ్రామస్థాయి సమన్వయంపై నాయకులతో చర్చ**

**- టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని జడ్పీటీసీ ఎన్నికల ప్రచార సరళి, ప్రచార కార్యక్రమాల నిర్వహణపై టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సోమవారం స్థానిక పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి ప్రచార కార్యక్రమాల నిర్వహణ, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించే అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జి మహమ్మద్, బాలకృష్ణ రెడ్డి, రాజా నాయక్, దక్కా రమేష్, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఎంపిటిసి అక్రమ తొలగింపు పై సీనియర్ న్యాయవాది ప్రభాకర్ విమర్శ



ప్రజాభూమి పోరుమామిళ్ల :

మండల పరిషత్ ఎంపీటీసీల అక్రమ తొలగింపు పై సీనియర్ న్యాయవాది కె ప్రభాకర్ రావు ఘాటుగా విమర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మండల పరిషత్ ఎంపీటీసీల అక్రమ తొల గింపులు రాజకీయ దురుద్దేశంతో చేసినవే తప్ప ఇంకొకటి కాదు. అప్లికేషన్ లోను అన్ని సక్రమంగా ఇచ్చినను అందులో ఒక పేపరు తొలగించి . ఇంకా చిన్న చిన్న కారణాలతో తొలగించడం జరిగింది ఒక పార్టీకి మేలు చేసే విధంగా ప్రవర్తించడం సరికాదని ఎలక్షన్ కమిషన్ చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాను తొలగించకూడదని చెప్పినను. వినుకొ కుండ అధికార పార్టీకి తొత్తులుగా ప్రవర్తిస్తున్నారని. ప్రజాస్వామ్యంలో ప్రజల చే ఎన్నిక కాబడతారని ఎస్సీ, బీసీ లను పోటీల్లో లేకుండా చేసి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటున్నారని ఆర్డీవో . ఎలక్షన్ ఆఫీసర్ తో గట్టిగా వాదించడం జరిగింది అని అడ్వకేట్ ప్రభాకర్ రావు అన్నారు.

## అభివృద్ధి కొనసాగాలంటే వైకాపాకే పట్టం కట్టండి

**ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించండి**

**- ఓటర్లను కోరిన చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ**



ప్రజాభూమి, పులివెందుల:

పులివెం దుల అభివృద్ధి చెందాలంటే తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి చైర్మన్ అభ్యర్థిగా నన్ను, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ ఓటర్లను అభ్యర్థించారు.సోమవారం పట్టణం లోని బ్రాహ్మణపల్లి రోడ్డు, దర్గా వీధి తదితర ప్రాంతాలలో వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ సునీతమ్మ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలంటే ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా సత్తా ఏమిటో చాటాలన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. పులివెందుల పట్టణంలో వీధి దీపాల కొరత ఎక్కడ చూసినా ఉందన్నారు.వైకాపాకు మళ్లీ అవకాశం ఇస్తే అభివృద్ధి ఇంకా చేసి చూపిస్తామన్నారు. టీడీపీ నాయకులు ఓట్లు వేయనీకుండా చేసేందుకు ప్రయత్నిస్తారని, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రుక్మిణి దేవి, అరుణ, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



మంగళవారం 27 అక్టోబరు 2026

# ఎన్నికల విధుల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

## పోలింగ్‌కు సంబంధించిన రికార్డులను పక్కాగా నమోదు చేయాలి: జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు: మున్సిపల్ ఎన్నికల విధులను నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక గ్రాఎఖచీ డిగ్రీ కళాశాల నందు మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన శిక్షణలో భాగంగా నిర్వహించిన రెండవ విడత శిక్షణ తరగతిలో ఆయన ఇ=ా మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో నిబంధనల పాటింపుతో పాటు రికార్డుల నమోదు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమకు అందించిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి, ఎన్నికల నియమ నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తాను ఇటీవల కేరళ రాష్ట్రంలో ఎన్నికల పరిశీలకుడిగా విధులు నిర్వహించినప్పుడు అక్కడ పోలింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్ అకౌంట్ వంటి రికార్డులను అత్యంత కచ్చితత్వంతో నమోదు చేసినట్లు గమనించానన్నారు. రాష్ట్రంలోనూ ఇదే విధమైన పద్ధతిని పాటిస్తూ, ఎన్నికల రికార్డులను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్ అకౌంట్ అనేవి అత్యంత కీలకమైన అధికారిక పత్రాలని, వాటిలో నమోదు చేసే వివరాలు కౌంటింగ్ సమయంలో కీలక పాత్ర



పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి కాలమ్‌ను నిబంధనల ప్రకారం పూర్తిచేయాలని, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో పత్రాలను అప్పగించే సమయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల లెక్కలు, వినియోగించిన బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బాక్సుల్లో వేసిన ఓట్ల వివరాలు సక్రమంగా సరిపోలేలా తనిఖీ చేయాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందన్నారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని, పోలీసు సిబ్బంది సహకారంతో ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, గుర్తింపు ప్రక్రియ తదితర అంశాలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని తెలిపారు. ముఖ్యంగా ఐదవ పోలింగ్ అధికారి నిర్వహించే బాధ్యతల్లో భాగంగా యారో క్రాస్ మార్క్ రబ్బరు స్టాంపును నిబంధనల ప్రకారం మాత్రమే ఉపయోగించేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ఎన్నికల్లో కొన్ని సందర్భాల్లో యారో క్రాస్ మార్క్ రబ్బరు స్టాంపుకు బదులుగా ఇతర గుర్తులను ఉపయోగించడం వల్ల పోలింగ్ ప్రక్రియలో పొరపాట్లు జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఎన్నికల సామగ్రిని ఉపయోగించే విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను స్పష్టంగా తెలుసుకొని విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. టెండర్ ఓట్లు సహా పోలింగ్ సమయంలో ఎదురయ్యే సమస్యలపై అధికారులు ముందుగానే అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సందేహం తలెత్తినపుడు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా విధులు నిర్వహిస్తే ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖూణా రవి, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు

# రేణిగుంట విమానాశ్రయంలో భారత ఉపరాష్ట్రపతి కి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు విచ్చేసిన భారత .ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ కు రేణిగుంట విమానాశ్రయం వద్ద జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇంచార్జి మినిస్టర్ అనగాని సత్య ప్రసాద్, డి ఐ జి షిమోషి, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, సిమ్స్ డైరెక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం. భారత ఉప రాష్ట్రపతి రోడ్డు మార్గానతిరుమలకి బయల్దేరి వెళ్లారు.

# నామినేషన్లపై అభ్యంతరాలు కొట్టివేత.. బరిలో పోలమ్మ, జనార్ధన్ రెడ్డి!

## తిరుమూరు వైసీపీ, నెల్లిపూడి టీడీపీ అభ్యర్థులకు ఊరట



ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలంలోని తిరుమూరు, నెల్లిపూడి ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాలను ఆర్డీవో కొట్టివేశారు.దీంతో తిరుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తిరుమలశెట్టి పోలమ్మ, నెల్లిపూడి టీడీపీ అభ్యర్థి దువ్వూరు జనార్ధన్ రెడ్డి నామినేషన్లు అర్హత సాధించాయి.తిరుమూరు ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన తిరుమలశెట్టి పోలమ్మ నామినేషన్‌పై వచ్చిన అభ్యంతరాలను ఆర్డీవో తోసిపుచ్చారు.దీంతో ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థినిగా ఎన్నికల బరిలో కొనసాగనున్నారు.అదేవిధంగా నెల్లిపూడి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరఫున నామినేషన్ వేసిన దువ్వూరు జనార్ధన్ రెడ్డి నామినేషన్‌పై వచ్చిన అభ్యంతరాన్ని కూడా ఆర్డీవో కొట్టివేశారు. దీంతో ఆయన నామినేషన్ అర్హత సాధించడంతో నెల్లిపూడి ఎంపీటీసీ ఎన్నికల బరిలో కొనసాగనున్నారు.ఆర్డీవో నిర్ణయంతో ఇరు పార్టీల అభ్యర్థుల పోటీకి సంబంధించి నామినేషన్లపై నెలకొన్న అభ్యంతరాలు తొలగిపోయాయి.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



ప్రజాభూమి ప్రతినిధి,పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీతుషార్ డూడినగరంలోని పలు ఎన్నికల కేంద్రాలను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాఎజ= ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కేంద్రాన్ని వారు స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ నందు వివిధ రాజకీయ పార్టీ, ఇండిపెండెంట్ పార్టీ ఏజెంట్లకు అభ్యర్థులకు, మరియు సిబ్బందికి ,అధికారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు, పలమనేర్ మున్సిపాలిటీకి సంబంధించిన రెండు సెమినార్ హాలు నందు కౌంటింగ్ ప్రక్రియ కొరకు మూడంచెల భద్రత చర్యలు ఈ కళాశాలలో పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వీకోట మండలాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలువిద్యుత్ సౌకర్యంతో పాటు రాకపోకలకు అనువైన దారులు, పటిష్టమైన క్యూలైన్ల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భవాని తదితరులు పాల్గొన్నారు

# స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత

## -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికా రులను ఆదేశించారు. సోమవారం స్థానిక పి వి కే ఎన్ డిగ్రీ కళాశాల నందు మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను, మరియు రిసెప్షన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో భారీ కేడ్లుపటిష్టంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు ఓట్ల భద్రతకు సంబంధించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన త్రివిధ భద్రతా వలయం, సీసీ టివి నిఘా, 24 గంటల ప్రత్యేక పోలీసు పహారాపై సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. స్ట్రాంగ్ రూమ్లు, పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లోకి అనధికార వ్యక్తులు లేదా వాహనాలు ప్రవేశించకుండా కఠినమైన ఆంక్షలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా రెవెన్యూ, ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో నవీన్, నాగరాజు, ఖీ మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తిరుమలలో ఘన స్వాగతం





ప్రజా భూమి ప్రతినిధి,తిరుమల, తిరుమల శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు విచ్చేసిన ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ కి తిరుమల పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుమల పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ, ఎస్పీ మురళీకృష్ణ తదితర అధికారులు ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను అధికారులు వివరించారు. ఉపరాష్ట్రపతి తిరుమల పర్యటన సందర్భంగా శ్రీవారి ఆలయంలో దర్శనానికి సంబంధించి టీటీడీ అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని తిరుమలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక నిఘా..

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

- ఎన్నికల వ్యయ పరిధిలోకి చెల్లింపు ప్రచారాలు, ప్రాయోజిత పోస్టులు
- అభ్యర్థుల ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచురించే పోస్టులు, చిత్రాలు, వీడియోలు, లఘు చిత్రాల విషయంలో కంటెంట్ క్రియేటర్లు, సామాజిక మాధ్యమాల ఇన్ ఫ్లూయన్సర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా, కులాలు, మతాలు, వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా లేదా అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎలాంటి ప్రచార సామగ్రిని రూపొందించవద్దని స్పష్టం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వెలువడే ప్రచార అంశాలపై ఎన్నికల పర్యవేక్షణ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తరఫున సామాజిక మాధ్యమాల్లో నిర్వహించే చెల్లింపు ప్రచారాలు, ప్రాయోజిత పోస్టులు, ప్రచార ఒప్పందాల ద్వారా



చేసే కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చులు అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి వస్తాయని తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే వారికి చెల్లించే రుసుములను ఎన్నికల వ్యయ పరిశీలనలో భాగంగా నమోదు చేస్తామని, సంబంధిత వివరాలను ఎన్నికల అధికారులకు పారదర్శకంగా వెల్లడించాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధించిన ప్రచార ప్రకటనలు, వీడియోలు తదితర ఎన్నికల ప్రచార సామగ్రిని సామాజిక మాధ్యమాల్లో ప్రచురించే ముందు నిబంధనల ప్రకారం జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు తావులేకుండా బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు.

# శ్రీకాళహస్తిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ ఘన ప్రారంభోత్సవం

## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీరామ్ నగర్ కాలనీ మెయిన్ రోడ్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలను అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ నూతన శాఖను సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి రీజినల్ మేనేజర్ జి.వి. రమణరావు, శాఖ మేనేజర్ బి. వెంకట్రాయులు మరియు శ్రీకాళహస్తి పట్టణ ప్రముఖులు, ఖాతాదారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ జి.వి. రమణరావు మాట్లాడుతూ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా సుమారు 5,200 శాఖలతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 150 శాఖలతో ప్రజలకు విస్తృతమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తోందని తెలిపారు. శ్రీకాళహస్తిలో నూతన శాఖ ప్రారంభంతో స్థానిక ప్రజలకు, వ్యాపారవేత్తలకు, రైతులకు, ఉద్యోగులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. శాఖ మేనేజర్ బి. వెంకట్రాయులు మాట్లాడుతూ, నూతన శాఖ ద్వారా పొదుపు ఖాతాలు, కరెంట్ ఖాతాలు, బంగారు రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు, వ్యవసాయ రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలకు సులభమైన, వేగవంతమైన, నమ్మకమైన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రముఖులు, ఖాతాదారులు వేణుగోపాల్,వెంకటముని, భార్గవ్ మూర్తి, ఉమ,కె. కృష్ణకుమార్, పి. జనార్ధన్ రావు, శ్రీమతి. శైలజ,బి. సదానందం మరియు పార్దు హాజరై నూతన శాఖ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు, వ్యాపారులు, రైతులు మరియు పరిసర గ్రామాల ప్రజలు బ్యాంకు అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాఖ మేనేజర్ బి. వెంకట్రాయులు కోరారు.

# అకస్మాత్తుగా పాఠశాల భవ

## నం కుప్పకూలి పెను ప్రమాదం నుంచి తప్పించుకున్న పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

మండలంలోని ఎర్రమరెడ్డిపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షాలకు అకస్మాత్తుగా కూలిపోయింది ఆ సమయంలో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ప్రార్థన చేస్తుండగా ఈ సంఘటన జరిగింది త్రుటిలో విద్యార్థులు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ వెంటనే సమాచారాన్ని మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు సోమవారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి బాలయ్య తో పాటు సమగ్ర శిక్ష అసిస్టెంట్ మా మానిటిరంగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ సుధాకర్ నాయుడు ఎంఈఓ బాలయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీహరి ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ గ్రామస్తులు నవీన్ వెంకటయ్య అంకయ్య జనార్ధన్ సంతోష్ విష్ణు తదితరులతో కలిసి పాఠశాల భవనాన్ని పరిశీలించి శిథిలాలను పక్కకు తొలగించారు పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు గతంలోనే పాఠశాల దుస్థితి గురించి గ్రామస్తులు అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్టు వారు చెప్పారు తాత్కాలికంగా పాఠశాల రేకుల షెడ్డు నిర్మించి అందులోనైనా కొనసాగిస్తామని గ్రామస్తులు తెలిపారు.

# డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

రామాయణం భారతీయుల జీవితాలకు ధర్మ మార్గాన్ని చూపించిన గొప్ప గ్రంథమని, రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి పూజ్యనీయుడని డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ అన్నారు. సోమవారం ఎస్ వి ఏ ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి ధన్యుడని, రామాయణం ద్వారా వాల్మీకి సత్యం, ధర్మం, త్యాగం, ప్రేమ, సోదర భావం,క్షమ మొదలైన విలువలను బోధించారని అన్నారు.. రామాయణం ఆదికావ్యంగా ప్రసిద్ధిగాంచిందని, మన దేశంలోనే తొలి కవిగా వాల్మీకి ప్రసిద్ధిగాంచాడని ప్రిన్సిపాల్ తెలిపారు.. వాల్మీకి రామాయణం అనేక భారతీయ భాషల సాహిత్యానికి, నాటకాలకు, సంగీతానికి, ఇతర కళలకు ప్రేరణగా నిలిచిందని ఇతర వక్తలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారాం,డాక్టర్ కట్టా సుబ్బారావు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

# శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు.ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టిటిడి బోర్డు సభ్యులు శ్రీ రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధితిరుపతి, వాల్మీకి జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని కపిల తీర్థం వద్ద ఉన్న మల్వాడి గుండం ప్రక్కన శ్రీ వాల్మీకి ఆశ్రమంలో సోమవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాల్మీకి మహర్షికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలను శ్రద్ధాభక్తులతో జరిపించారు. అనంతరం స్వామివారి ప్రసాద వితరణ చేపట్టగా, దాదాపు 500 మందికి పైగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకల్లో తిరుపతి జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు సదుం శోభన్ బాబు, సలహాదారులు తలారి బాలయ్య, అధ్యక్షులుఎం.కే. నాగరాజు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ముఖ్య అతిథులుగా పాల్గొని వేడుకలకు విశేష శోభ చేకూర్చారు. వారితో పాటు సంఘ నాయకులు గజేంద్ర, మహేష్, నారాయణప్ప, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ తో పాటు వాల్మీకి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నాయకులు, భక్తుల సమష్టి భాగస్వామ్యంతో ఈ ఆధ్యాత్మిక ఉత్సవం అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిసింది.

# పోలీసు వలయంలో ఆర్డీఓ కార్యాలయం..!

- నామినేషన్ల అప్పీళ్ల పరిశీలన వేళ భారీ బందోబస్తు
- చంద్రగిరి నియోజక వర్గంలో 142 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామి నేషన్ల తిరస్కరణ
- అభ్యర్థులతో కలిసి అప్పీళ్ల పరిశీలన కేంద్రానికి వెళ్లిన చెవిరెడ్డి
- ఒక న్యాయవాదిగా అభ్యర్థుల తరపున వెళ్లిన చెవిరెడ్డి
- చెవిరెడ్డిని లోపలకు అనుమతించకుండా పోలీసులు అడ్డగింత
- తనను అడ్డు కోవడంపై పోలీసుల తీరును ప్రశ్నించిన చెవిరెడ్డి
- ఎస్పీ సుబ్బ రాయుడిపై తీవ్ర ఆరోపణలు.. న్యాయపోరాటం చేస్తామని వెల్లడి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణపై దాఖలైన అప్పీళ్ల పరిశీలన నేపథ్యంలో తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం చుట్టూ ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. చంద్రగిరి, నగరి, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని ఎంపీటీసీ అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లను ఆర్డీఓ రామ్మోహన్ సోమవారం పరిశీలించారు. పాకాల మండలానికి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అప్పీళ్ల పరిశీలన కేంద్రానికి వెళ్లారు. చంద్రగిరి నియోజక వర్గంలో 142 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామి నేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. తిరస్కరణకు గురైన అభ్యర్థులు తమ అప్పీళ్లను ఇప్పటికే ఆర్డీఓకు అందజేశారు. అప్పీళ్ల పరిశీలన జరుగుతున్న నేపథ్యంలో చెవిరెడ్డి కార్యాలయం వద్దే ఉండి అభ్యర్థులకు న్యాయపరమైన సలహాలు అందిస్తూ ధైర్యం చెప్పారు.



**పోలీసుల తీరుపై చెవిరెడ్డి ఆగ్రహం**

అభ్యర్థులకు అడ్వకేట్‌గా వెళ్లిన తనను పోలీసులు అడ్డుకోవడంపై చెవిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక రాజకీయ నాయకునిగా కాదని, న్యాయవాదిగా లోపలకు వెళ్లే హక్కు తనకు ఉందని, ఆ హక్కును కాలరాసే అధికారం పోలీసుకు లేదని, దీనిపై హైకోర్టులో కేసు ఫైల్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు లోపలకు పంపడం లేదని పోలీసులు చెప్పడంతో, ఆర్.ఓ ఆదేశాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయ వాదులను సైతం అడ్డు కోవడం ఏమిటని ప్రశ్నించారు. అప్పీళ్ల పరిశీలన ప్రక్రియను అంత రహస్యంగా నిర్వహించాల్సిన అవసరం ఏముందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తిరుపతి ఎస్పీ అవినీతి బయట పెడతా..**

తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి వ్యవహారశైలిపై చెవిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారా.. టీడీపీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారా అన్నది అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. చంద్రగిరి నియోజక వర్గంలో స్థానిక ఎన్నికలు జరుగుతున్న తీరుపై చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. నామినేషన్ల తిరస్కరణ వ్యవహారంలో బాధ్యులైన రిటర్నింగ్ అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని, ప్రైవేటు కేసులు దాఖలు చేయనున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో తప్పులకు పాల్పడిన అధికారులు చట్ట పరమైన పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఎస్పీ సుబ్బరాయుడు అవినీతి, అక్రమాలకు సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెవిరెడ్డి మీడియా ముందు చెప్పారు. వాటిని త్వరలో బయట పెడతానని, ఆయన అక్రమ ఆస్తుల వివరాలను ఆదాయపన్ను శాఖకు అంద జేస్తానన్నారు. అక్రమ ఆస్తులను సీజ్ చేయాలని కోరుతూ న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని వెల్లడించారు. వైఎస్సార్సీపీ అభ్యర్థుల అప్పీళ్లపై తుది నిర్ణయం వెలువడే వరకు ఆర్డీఓ కార్యాలయం వద్దే వేచి ఉంటానని చెవిరెడ్డి స్పష్టం చేశారు. నామినేషన్ల తిరస్కరణపై న్యాయపరమైన పరిష్కారం లభించేలా పోరాటం కొనసాగిస్తామని చెవిరెడ్డి స్పష్టం చేశారు.

# బీచ్ గ్రాప్లింగ్ రాష్ట్రస్థాయి చాంపియన్ రేణిగుంట



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీలలో తిరుపతి జిల్లా రేణిగుంట విద్యార్థులు ఆల్రౌండ్ ప్రతిభతో ఛాంపియన్లుగా నిలిచారు. గన్నవరంలో ఈనెల 24 25 తేదీలలో 4వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్ మరియు సీనియర్ స్థాయిలో బీచ్ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. కృష్ణాజిల్లా బీచ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలలో తిరుపతి జిల్లా రేణిగుంట ప్రభుత్వ బాలికల పాఠశాల మరియు కళాశాల నుంచి ఫిజికల్ డైరెక్టర్ గొడుగు చింత పద్మ ఆధ్వర్యంలో మొత్తం 25 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో అండర్ -11 విభాగంలో 7 మంది విద్యార్థినులు పాల్గొనగా అందులో 6 మంది దమరి, రిషి ప్రియ, మహిత, సాహితి, మోక్షిత, హిమశ్రీ (బంగారు), ఒకరు త్రివేణి (సిల్వర్) పతకాలు సాధించారు. అండర్ -13 విభాగంలో 6 మంది విద్యార్థినులు పాల్గొనగా అందరూ స్వాతి, కోమలి రెడ్డి, హరిని, చైత్ర, కార్తీక, నిషా ( బంగారు)పతకాలు సాధించారు. అండర్ -15 విభాగంలో 8 మంది విద్యార్థినులు పాల్గొనగా 7మందిలో మోక్షిత, కీర్తి ప్రియ, శ్రీవల్లి, భార్గవి,దీక్షిత, పూజ, మేఘన ( బంగారు), ఒకరు చరిత సిల్వర్ పథకాలను సాధించారు. అదేవిధంగా క్యాడెట్స్ (ఇంటర్ మీడియట్ )విభాగంలో 4 విద్యార్థినులు గోమతి, యశస్విని, ఉషశ్రీ, గ్రేసీ పాల్గొనగా అందరూ బంగారు పతకాలను సాధించారు.

**జాతీయస్థాయి పోటీలకు 12 మంది ఎంపికయ్యారు.**

రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీలలో ఆల్రౌండర్ ప్రతిభతో పథకాలు సాధించిన 12 మంది రేణిగుంట ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిలో రిషి ప్రియ(6వ తరగతి ), సాహితి(6వతరగతి), మహిత ( 6వ తరగతి ), కోమలి రెడ్డి (7వ తరగతి ), చైత్ర (7వ తరగతి), మేఘన (7వ తరగతి), హరిణి ( 8వ తరగతి ), కీర్తి ప్రియ (8వ తరగతి ), సి.మోక్షిత (8వ తరగతి ), దీక్షిత (8వ తరగతి ), పూజ (9వ తరగతి ), ఉషశ్రీ (ఇంటర్ ద్వితీయ ) ఉన్నారు. వీరంతా ఈనెల 28వ తేదీన హరిద్వార్‌లో జరిగే 4వ జాతీయస్థాయి బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు హాజరు కానున్నారు. ఈ పాఠశాల నుంచి మొట్ట మొదటిసారిగా జాతీయస్థాయి పోటీలకు 12 మంది విద్యార్థినులు ఎంపిక కావడం గర్వకారంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల దేవి తెలిపారు. విద్యార్థినులను రాష్ట్ర జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుతున్న ఫిజికల్ డైరెక్టర్ గొడుగు చింత పద్మను మరియు విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

మట్టిలో మాణిక్యాలు గా రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభ చాటుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలో చదివే క్రీడాకారిణులకు ఆర్థిక భారం అడ్డుపడుతోంది. ప్రతిభ ఉండి జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించగలిగే సత్తా ఉన్నప్పటికీ అంత దూరం వెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా భరించలేని దీనస్థితిలో నిరుపేద క్రీడాకారినులు ఉంటున్నారు. ఎవరైనా మనసున్న దాతలు ముందుకు వచ్చి క్రీడాకారినులను ఆర్థిక సాయం అందించగలిగితే వారు ఈనెల 28వ తేదీన హరిద్వార్‌లో జరిగే 4వ స్థాయి జాతీయ పోటీలకు హాజరవుతారు. లేని పక్షంలో పోటీలకు దూరమయ్యే పరిస్థితి ఉంది.

# పదేళ్లలో లక్షకు పైగా వాహనాల ఉత్పత్తి.. ఇసుజు మోటార్స్ ఘనత!

## శ్రీసిటీ నుంచి ప్రపంచ మార్కెట్లకు వాహనాల ఎగుమతి.. రూ.1,500 కోట్ల పెట్టుబడులు, 1,600 మందికి ఉపాధి



ప్రజాభూమి ప్రతినిధి వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా పారిశ్రామిక రంగంలోని శ్రీసిటీ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రముఖ వాహన తయారీ సంస్థ ఇసుజు మోటార్స్ ఇండియా శ్రీసిటీలో తన పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ పదేళ్లలో లక్షకు పైగా వాహనాలను ఉత్పత్తి చేసి, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. ఈ సందర్భంగా సోమవారం పరిశ్రమ ప్రాంగణంలో పదేళ్ల విజయోత్సవ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి ఇసుజు గ్రూప్ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి నవోహిరో యమగుచి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి షిగేరు వకబయాషి, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు హాజరయ్యారుసంస్థ సాధించిన ప్రగతిని, భవిష్యత్తు లక్ష్యాలను ఈ సందర్భంగా వివరించారు.

**పెట్టుబడులకు అనుకూల వాతావరణం**

ఇసుజు మోటార్స్ సాధించిన ప్రగతిపై పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉండటం సంస్థ అభివృద్ధికి దోహదపడిందని పేర్కొన్నారు. తయారీ రంగం అభివృద్ధి, వాహనాల ఎగుమతులు, ఉపాధి కల్పనలో ఇసుజు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సంస్థ మరింత అభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.

**ప్రపంచస్థాయి సదుపాయాలతో పారిశ్రామిక ప్రగతి**

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, 2013లో ఇసుజుతో అవగాహన ఒప్పందం కుదిరినప్పటి నుంచి సంస్థ ప్రగతిని ప్రత్యక్షంగా చూడటం ఆనందంగా ఉందన్నారు. నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ఇసుజు సాధించిన విజయాలు శ్రీసిటీలోని పటిష్ఠమైన పారిశ్రామిక వ్యవస్థకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం, పెట్టుబడిదారులకు సత్వర సహకారం అందించడం ద్వారా అంతర్జాతీయ సంస్థల అభివృద్ధికి శ్రీసిటీ దోహదపడుతోందని వివరించారు.

భాగస్వాముల సహకారంతో మరింత అభివృద్ధి

ఇసుజు గ్రూప్ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి నవోహిరో యమగుచి మాట్లాడుతూ, సంస్థ విజయాల్లో ఉద్యోగులు, వాహన విక్రయదారులు, విడిభాగాల సరఫరాదారులు, ఇతర భాగస్వాముల కృషి ఎంతో కీలకమని అన్నారు. శ్రీసిటీ యాజమాన్యంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించడమే భవిష్యత్తు లక్ష్యమని వెల్లడించారు. ఇసుజు ఇండియా ఛైర్మన్ కెంజిరో హెూమ్మసన్ సంస్థ పదేళ్ల ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.

**రూ.1,500 కోట్ల పెట్టుబడులు.. 1,600 మందికి ఉపాధి**

శ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమ గత పదేళ్లలో సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి చెందింది. ఇప్పటివరకు లక్షకు పైగా వాహనాలను ఉత్పత్తి చేయడంతో పాటు సుమారు 1,600 మందికి ఉపాధి కల్పించింది. ఆసియా, మధ్యప్రాచ్య దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తూ అంతర్జాతీయ మార్కెట్లలో తనదైన గుర్తింపును సాధించింది. 2024--25 ఆర్థిక సంవత్సరంలో 20,000కు పైగా వాణిజ్య వాహనాలను ఎగుమతి చేయడం సంస్థ ఎగుమతి సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. పదేళ్లలో లక్షకు పైగా వాహనాల ఉత్పత్తి, వేల కోట్ల పెట్టుబడులు, వందలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఇసుజు మోటార్స్ సాధించిన ప్రగతి శ్రీసిటీ పారిశ్రామిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. తెలిపారు

# ముక్కోటి క్షేత్రంలో కనువిందు చేసిన డ్రోన్ లేజర్ షో ఆకాశంలో ఆధ్యాత్మిక వెలుగులు..!

## భక్తులను మంత్రముగ్ధులను చేసిన దివ్య ప్రదర్శన..

ప్రజాభూమి ప్రతినిధి : చంద్రగిరి:

తొండవాడలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం ముక్కోటి క్షేత్రంలో నిర్వహించిన డ్రోన్ లేజర్ షో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ అద్భుత ప్రదర్శనతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాత్రి వేళ ఆకాశంలో రంగురంగుల కాంతులు, లేజర్ వెలుగులు, డ్రోన్ల ద్వారా ప్రదర్శించిన దృశ్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధ్యాత్మికతతో మేళవించి నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ అగస్త్యేశ్వర స్వామి, శ్రీ ఆనందవల్లి అమ్మవార్ల దివ్య సన్నిధిలో నిర్వహించిన ఈ ప్రదర్శనను తిలకించేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. ఆకాశంలో వెలుగుల విన్యాసాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాయి. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలతో పాటు డ్రోన్ లేజర్ షో భక్తులకు సరికొత్త అనుభూతిని అందించింది. సంప్రదాయ ఆధ్యాత్మిక వైభవానికి ఆధునిక సాంకేతికత తోడవడంతో తొండవాడ ముక్కోటి క్షేత్రం భక్తజన సందోహంతో సందడిగా మారింది. భక్తి, ఆధ్యాత్మికత, ఆధునిక సాంకేతికతల సమ్మేళనంగా నిలిచిన డ్రోన్ లేజర్ షో ముక్కోటి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది అని



ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

# ముక్తి కోటేశ్వరస్వామివారిని దర్శించుకున్న పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ

## నందలూరు అటవీ ప్రాంతంలోని పవిత్ర శైవక్షేత్రంలో స్వామివారి ప్రత్యేక దర్శనం



ప్రజా భూమిప్రతినిధి, తిరుపతి

పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ కడప జిల్లా నందలూరు సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో, పెన్నా, చెయ్యేరు, సగిలేరు, గుంజన నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో వెలసిన శ్రీ ముక్తి కోటేశ్వరస్వామివారి ఆలయాన్ని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ప్రకృతి ఒడిలో, నదీ ప్రవాహాల పవిత్రత మధ్య, ఆధ్యాత్మిక ప్రశాంతతను చాటిచెప్పే ఈ ప్రాచీన శైవక్షేత్రాన్ని దర్శించుకోవడం విశేషమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పౌర్ణమి వంటి పవిత్రమైన రోజున పరమశివుని దర్శించుకోవడం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని, మనశ్శాంతిని అందిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్య వ్యాప్తి, లోకకల్యాణం లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ, ఏకవీర సేవా ఫౌండేషన్ ద్వారా ధార్మిక సేవలతో పాటు గోసంరక్షణ, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రకృతి సంపదను, పవిత్ర నదులను, ప్రాచీన ఆలయాల ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భగవంతుని అనుగ్రహంతో సమస్త లోకాలకు శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ స్వామివారిని ప్రార్థించారు.

# వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా బందిలి సురేష్

## సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చేతుల మీదుగా బీఫామ్ స్వీకరణ



ప్రజా భూమి ప్రతినిధి: వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా బందిలి సురేష్ పార్టీ బీఫామ్ అందుకున్నారు. సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చేతుల మీదుగా ఆయన బీఫామ్ స్వీకరించారు. మండల పరిషత్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బందిలి సురేష్‌కు జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. ఈ క్రమంలో పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవసరమైన బీఫామ్‌ను నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. బీఫామ్ అందుకోవడంతో బందిలి సురేష్ జడ్పీటీసీ ఎన్నికల బరిలో అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. వరదయ్యపాలెం మండలంలో జరగనున్న జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నాయిపార్టీ అభ్యర్థిగా బందిలి సురేష్ ప్రజల్లోకి వెళ్లి మద్దతు కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో రాజకీయ వాతావరణం ఎన్నికల దిశగా వేడెక్కుతోంది.

# వ్యవసాయ సహకార సంఘము నందురైతులకురుణాలు:సింగల్ విండోచైర్మన్ కృష్ణమనేని సావిత్రి..!



ప్రజాభూమి ప్రతినిధి, పాకాల (చంద్రగిరి)

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము నందు సోమవారం రైతులకు పంట రుణాలు ఇచ్చారు. కావలివారిపల్లె గ్రామంకు చెందిన బి.చిన్న రెడ్డెప్పకి పంట రుణాలు మరియు ల్యాండ్ డెవలప్మెంట్ రుణాలు మంజూరు చేసినారు. సంఘము అధ్యక్షురాలు క్రిష్ణమనేని సావిత్రి చేతుల మీదుగా చెక్కులు పంపిణి చేశారు. పాకాల మండలం లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా అధ్యక్షురాలు తెలిపారు. ఈ కార్యక్రమములో సంఘం డైరెక్టర్ జె.ఆనంద్,సంఘం సీ.ఈ.ఓ బి.మురళి క్రిష్ణ మరియు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములుకండి

## - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. అవినీతిని అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో అవినీతి నిరోధక శాఖ రూపొందించిన ప్రత్యేక ప్రచార పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అవినీతికి సంబంధించిన ఫిర్యాదుల కోసం 1064 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రజలు వినియోగించుకోవాలని, అవినీతి నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాట్సాప్ నంబరు (94404 40057), ఎశీఎజూశ్రీఖఱత్‌ం-ఖఎఎఖజూ.స్త్రశీజ.ఱఅ కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అందేలా ప్రతి శాఖలో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేందుకు అవినీతి నిరోధక చర్యలు, ప్రజల్లో చైతన్యం కీలకమని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, నిజాయితీతో కూడిన పాలనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ బీవీ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

జనరల్ 10

మంగళవారం 27 అక్టోబరు 2026

# నవగ్రహ శోభిత పుణ్యక్షేత్రంలో అగస్త్యేశ్వర కళ్యాణ మహోత్సవం

## ముక్కోటి ఉత్సవాల్లో సేవా నిరతి చాటుకున్న ఎంబీయూ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

ఆధ్యాత్మికత, భక్తిభావాల సుగంధంతో చంద్రగిరి మండలం తొండవాడ పుణ్యక్షేత్రం మైమరిచింది. శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్ర సమీపాన, త్రివేణి సంగమ తీరాన వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ప్రాభవంతో సాగుతున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి, శ్రీ ఆనందవల్లి అమ్మవారికి శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి, అమ్మవారికి కనులపండువగా



ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. స్వామి, అమ్మవార్ల దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు తారకనామ స్మరణతో మునిగిపోయారు.

ఎన్.ఎస్.ఎస్. విద్యార్థుల నిరంతర సేవలు..

కాగా, ఈ మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మోహన్ బాబు యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు అందించిన సేవలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సిఐ సత్యనారాయణ విజ్ఞప్తి మేరకు స్పందించిన మోహన్ బాబు యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు ఉత్సవ ప్రాంగణంలో రంగంలోకి దిగారు. భారీగా వచ్చిన భక్తజనాన్ని క్రమబద్ధీకరించడంలో, క్యూలైన్ల నిర్వహణలో, ట్రాఫిక్ నివారణ చర్యలలో విద్యార్థులు శ్రమించారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో తమవంతు సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, భక్తుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ విద్యార్థుల సేవా నిరతి, సామాజిక స్పృహ ఇతర యువతకు ఆదర్శంగా నిలిచాయని స్థానికులు, ఆలయ అధికారులు కొనియాడారు.

# ఎన్నికల శిక్షణా వేదిక మార్పు

## -299 మంది ఉపాధ్యాయులకు చిన్మయ స్కూల్‌లో శిక్షణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులకు సంబంధించి ఉపాధ్యాయులకు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమ వేదికను మార్పు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదరమ్మ సోమవారం తెలిపారు. శిక్షణకు మొత్తం 299 మంది ఉపాధ్యాయులు హాజరుకానున్న నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో తగినంత స్థలం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు హిందూపురంలోని డీబీ కాలనీలో ఉన్న చిన్మయ స్కూల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులందరూ వేదిక మార్పును గమనించి, నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

# అభివృద్ధికి అవకాశం కల్పించండి...

## -15వ వార్డులో టిడిపి అభ్యర్థి విస్తృత ప్రచారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ పరిధిలోని 15 అవార్డులో అభివృద్ధి కోసం అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మంజుల కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పట్టణంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. నవంబర్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని, ప్రజలందరికీ తాను అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాలు కల్పనకు అంకితభావంతో పనిచేస్తానని మంజుల తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దుర్గా నాని పాల్గొన్నారు.

# శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో 158వ సోమవార అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగినది

ప్రజాభూమి, పుట్లూరు



మండలం, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో 158వ సోమవార అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించిన భారతీయ జనతా పార్టీ కో కన్వీనర్ కుందు శ్రీనివాసుల రెడ్డి ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 158 వ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం ఆలయ అభివృద్ధి కోసం నిర్వహించబడిందనీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమములో దాతలు ఆర్. ఓబులేశ్, భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఎక్స్ కో-కన్వీనర్ కుందు శ్రీనివాసుల రెడ్డి మరియు భక్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అజెండాగా ఆలం శిరీష ప్రచారం

## ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన



ప్రజాభూమి - నార్పల: నార్పల మండలం చామలూరు గ్రామ పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి తెదేపా అభ్యర్థిగా ఆలం శిరీష ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ సైకిల్ గుర్తు కు ఓటు వేయాలని అభ్యర్థి స్తున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు సంక్షేమ పథకాల అందజేత వంటిఅంశాలనుప్రస్తావిస్తూ ప్రజలతో మమేకమవు తున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఓటర్లకు హామీ ఇస్తున్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని విస్తృతం చేస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆలం నాగార్జున, గ్రామ తెదేపా, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తొండవాడ ముక్కోటి క్షేత్రంలో వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం..!

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

ఆధ్యాత్మికత, భక్తిభావాలతో తొండవాడ పుణ్యక్షేత్రం పులకించిపోయింది. స్వర్ణముఖి నది తీరాన వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి,శ్రీ ఆనందవల్లి అమ్మవారికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు,మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన దివ్య కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్ల దివ్య మంగళ స్వరూపాలను దర్శించుకున్నారు.ముక్కోటి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు.భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.



# తుఫాన్ ముప్పు: చంద్రగిరి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..!

- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి: ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపు!
- బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం దృష్ట్యా భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికలు
- ప్రజల భద్రతే పరమావధి.. అధికారుల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి
- లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు, పశుపోషకులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన
- అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే సందేశం

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా బలపడే అవకాశముందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్థానిక శాసనసభ్యులు పులివర్తి నాని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున ప్రజలు తమ ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో సంయమనంతో వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా నియోజకవర్గ ప్రజలకు పలు కీలక రక్షణ సూచనలు జారీ చేశారు. తుఫాన్ వేళ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. పెనుగాలుల సమయంలో కూలిపోయే ప్రమాదమున్న భారీ వృక్షాలు, కరెంటు స్తంభాలు, భారీ ప్రకటనల హోర్డింగుల కింద ఎవరూ ఆశ్రయం పొందకూడదని హెచ్చరించారు. మూగజీవాలైన పశువులు, గొర్రెల మందలను చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో కట్టేయకుండా సురక్షితమైన పాకలు, షెడ్లలో ఉంచాలని పశుపోషకులకు సూచించారు. వర్షపు నీటికి నానిపోయిన పాత గోడలు, బలహీనమైన ఇళ్లలో ఉండకుండా ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. నేలపై తెగిపడిన విద్యుత్ తీగలను పొరపాటున కూడా తాకకుండా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే లోతట్టు గ్రామాల ప్రజలు అధికారుల సాయంతో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ రోడ్లపైకి రాకుండా ప్రయాణాలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పొంగిపొర్లే వాగులు, కాజ్‌వేలు దాటే సాహసాలు చేయవద్దని హెచ్చరిస్తూ.. వ్యవసాయ పనుల్లో ఉండే రైతన్నలు ఉరుములు, మెరుపుల వేళ పొలాల్లో ఉండకుండా పక్కా భవనాల్లో ఆశ్రయం పొందాలని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు.



**- ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం:**

- తుఫాన్ ప్రభావంతో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. విపత్తు వేళ కుటుంబ సభ్యుల భద్రతను కాపాడుకోవాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే స్థానిక యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. నియోజకవర్గ ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం, అధికారులు పూర్తి సన్నద్ధతతో ఉన్నారని, ప్రజలంతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని కోరారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి..!

## - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి...

### ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత పాటించాలి - ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు

ప్రజాభూమి, కడప కలెక్టరేట్

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చే ప్రవర్తనా నియమావళి నిబంధనలను ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, సామాజిక మాధ్యమాలు, ముద్రణ, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు గౌరవించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వంటి కీలక దశలు కొనసాగుతున్న నేపథ్యంలో, తదుపరి ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర దశల్లోనూ ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో రాజకీయ తటస్థతను పాటించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.



**రాజకీయ కార్యకలాపాలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది రాజకీయంగా పూర్తి తటస్థతను పాటించాలి. ఏ రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం, రాజకీయ సమావేశాలు, ర్యాలీల్లో పాల్గొనడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేసే పోస్టులు పెట్టడం, వాటిని పంచుకోవడం, ఇష్టపడినట్లు గుర్తించడం, వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు చేపట్టకూడదు.

**ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు**

ప్రభుత్వ వాహనాలు, నిధులు, కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ అతిథి గృహాలు, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. ప్రభుత్వ నిధులతో అధికార పార్టీ విజయాలు, పథకాలను ప్రచారం చేసే ప్రకటనలు జారీ చేయకూడదు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించడం, కొత్త పథకాలు ప్రారంభించడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిర్వహణకు ప్రభుత్వ అధికారులు సహకరించరాదు.

**అధికారిక పర్యటనల్లో ఎన్నికల ప్రచారానికి తావివ్వరాదు**

మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంతో ముడిపెట్టినప్పుడు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వారికి సహకరించరాదు. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన అనుమతులు పొందిన తరువాతే చర్యలు చేపట్టాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని సూచించారు.

**నగదు, విలువైన వస్తువుల తరలింపులో నిబంధనలు పాటించాలి**

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, వెండి, బహుమతి వస్తువులు తదితరాలను అనుమానాస్పదంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్ణీత పరిమితులకు మించి నగదు లేదా విలువైన వస్తువులను తీసుకెళ్లాల్సిన సందర్భాల్లో సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు నిర్వహించినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలను అందించి సహకరించాలి.

**పోలింగ్ కేంద్రాల్లో నిష్పాక్షికంగా వ్యవహరించాలి**

పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడకూడదు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలి. పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు స్లిప్పులు తెల్ల కాగితంపై మాత్రమే ఉండేలా, వాటిపై రాజకీయ పార్టీ గుర్తులు లేదా అభ్యర్థుల పేర్లు లేకుండా చూడాలి. ఎన్నికల విధుల్లో ఉన్న ఉన్నతాధికారులు, తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించినా సంబంధిత నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు చేపట్టే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి సుండుపల్లి



సుండుపల్లి మండలం మచిరెడ్డిగారిపల్లె పంచాయతీ, చిన్న బీడీకిలో వెలసిన శ్రీరామ్ (వెంకటేశ్వర స్వామి) బాలాజీ ఆలయంలో పవిత్రోత్సవము శాంతి హోమము నిర్వహిం చినట్లు గ్రామస్తులు తెలిపారు. గత మూడు రోజుల నుండి వేద పండితులు లక్ష్మీనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకంలు నిర్వహించి మూడవ రోజు సోమవారము హోం పూజలు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ బి.వేణుగోపాల్, వారి సిబ్బంది హాజరై స్వామి వారికి సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు గుడి యొక్క ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ చార్యులు ద్వారా ఆశీర్వచనములు పొందారు దీంతో గ్రామస్తులు వారిని దుశ్శాలువలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హత్యా రాజకీయాలు మానాలి - ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,౨ కడప అర్బన్



ఓటమి భయంతో వైసీపీ రాజకీయ డ్రామాలకు తెరలేపుతోందని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఆరోపించారు. నగరంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిన్న నకాష్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ షంషీర్‌కు గాయమైందని, వ్యక్తిగత కారణాలతో జరిగిన గొడవను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కడపలో జరిగిన హత్యల వెనుక పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలే కారణమని ఆరోపించారు. కూటమి పార్టీలకు హత్యా రాజకీయాలు అవసరం లేదన్నారు. వైసీపీ మేయర్ అభ్యర్థి ఇంటిపై దాడి ఘటనలోనూ ఆ పార్టీ నేతలే దాడి చేయించుకున్నారని ఆమె ఆరోపించారు. గత 20 ఏళ్లలో వైసీపీ కడపను అభివృద్ధికి దూరం చేసిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీనివాసరెడ్డి హత్యకు వైసీపీ శ్రేణులే కారణమని, ఇటీవల దస్తగిరి హత్య ఘటన కూడా చోటుచేసుకుందని పేర్కొన్నారు. వైసీపీ రాజకీయ డ్రామాలను ప్రజలు నమ్మరని అన్నారు. కడప నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, కూటమి మేయర్ అభ్యర్థి మట్లి సువర్ణ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల తనిఖీలు.. పులి సంచారంపై ప్రజలకు అవగాహన

- రాయిగూడెం, పోచారం, శ్రీరామగిరి, రాజుపేట కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు
- కొండేపూడిలో పులి సంచారంపై గ్రామస్తులకు అప్రమత్తతపై అవగాహన



ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో ఎన్నికల నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు సోమవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని రాయిగూడెం, పోచారం, శ్రీరామగిరి, రాజుపేట ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ ఆఫీసర్, స్థానిక తహసీల్దార్ వై. సరస్వతి, ఎస్ఐ సాదిక్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించా రు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉం డాలని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**కొండేపూడిలో పులి సంచారంపై అవగాహన**

ఇదిలా ఉండగా తుమ్మిలేరు పంచాయతీ పరిధిలోని కొండేపూడి ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వస్తున్న సమాచారంపై అధికారులు గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ వై. సరస్వతి, ఎస్ఐ సాదిక్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు పలు జాగ్రత్తలు వివరించారు. అటవీ ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లకూడదని, ముఖ్యంగా రాత్రి వేళల్లో బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి లేదా ఇతర వన్యప్రాణుల ఆనవాళ్లు కనిపించినా వాటి సమీపానికి వెళ్లకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరూ భయాందోళనలకు గురికావద్దని, అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎన్నికల భద్రతతో పాటు ప్రజల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇస్తూ అధికారులు గ్రామాల్లో పర్యటించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలు,

# ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా సమన్వయంతో వ్యవహరించాలి

## పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్




ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

జిల్లాలో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా శాఖ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. వై. రామవరం మండలం లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచిన విధివిధానాలను పూర్తిగా అవగాహన చేసుకుని, వాటికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రంలో అనుసరించాల్సిన విధానాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని ఆయన తెలిపారు.విధుల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బందిని నియమించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించడం,ఎన్నికల నియమావళిని పాటించడం, ఓటర్లకు అవసరమైన సహకారం అందించడం, పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడం ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యత కలెక్టర్ స్పష్టం చేశారు.మండలం లోని పీవోలు, ఏపీవోలు ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తారని, వారికి అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సిబ్బంది మధ్య సమన్వయం, సమయపాలన, అప్రమత్తతతో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది సమష్టిగా కృషి చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆకాంక్షించారు.

పోలవరం జిల్లాలో ఎన్నికల సిబ్బంది పోలింగ్కు సంబంధించిన సామాగ్రిని ఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉన్న యెడల వెంటనే రిటర్నింగ్ అధికారి వెంటనే తెలియజేయాలని ఆయన అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ఆర్వో నరేంద్ర కుమార్, తహసీల్దార్ శ్రీరాములు,ఎంపీడీఓ కె. బాపన్న దొర, పి ఓ లు, ఏ పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- 27, 28 తేదీల్లో స్థానిక సెలవు ప్రకటన.. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు.మంగళవారం అక్టోబరు 27 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటికే చర్చించిన విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు**

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాలో స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వా డీ కేంద్రాలు మూసివేయాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ప్రజలకు అవసరమైన ముందస్తు సమాచారాన్ని అందించాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, వాగులు, వంకలు, నదీ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.



అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, రహదారులపై వర్షాల ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు వరద ప్రవాహాలు దాటకుండా, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన ముందస్తు చర్యలు, శాఖల వారీగా సంసిద్ధతపై సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో తీసుకున్న చర్యల వివరాలతో సిద్ధంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిల్లా అత్యవసర కంట్రోల్ రూమ్: 1800-425-4225 వర్షా లు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితు లు ఎదురైనప్పుడు ప్రజలు పై కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

# విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలి

## గొరగుమ్మి ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ సమావేశం - ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ





ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని గొరగుమ్మి ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకన్న దొర అన్నారు పోలవరం జిల్లా గంగవరం మండలం గొరగుమ్మి గ్రామంలోని ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)సమావేశంలో ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకన్న దొర మాట్లాడుతూ, ప్రోగ్రెస్ కార్డుల్లో కొంతమంది విద్యార్థులకు మార్కులు తక్కువగా వచ్చినా,మరికొంత మందికి ఎక్కువ మార్కులు వచ్చినా పిల్లలను నిరుత్సాహపరచకుండా ప్రేమతో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించా రు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా,వారి సామర్థ్యాలను గుర్తించి చదువులో ముందుకు సాగేలా ప్రోత్సహించాలన్నారు విద్యార్థులను ప్రతిరోజూ ఉదయం త్వరగా సిద్ధం చేసి, ఉదయం 8 గంటలకల్లా పాఠశాలకు పంపించాలని కోరారు. తాను కూడా ఉదయం 8గంటలకే పాఠశాలకు చేరుకుంటానని, విద్యతో పాటు వివిధ అభ్యాస కార్యక్రమాలు, ఇతర యాక్టివిటీలను నిర్వహించడం ద్వారా పిల్లలలో నైపుణ్యాలను పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, అక్టోబర్ 27,28,29 తేదీల్లో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందన్న సమాచారంతో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ఉపాధ్యాయుల అంకితభావంపై ఎస్ఎంసీ చైర్మన్ ప్రశంసలు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లోత వెంకటరమణ మాట్లాడుతూ,గొరగుమ్మి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందించడం అభినందనీయమన్నారు పిల్లల చదువుపై ఉపాధ్యాయులు చూపు తున్న శ్రద్ధ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ లోత వెంకటరమణ,వైస్ చైర్మన్ కోసూరి సీతారామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె.వెంకన్నదొర, ఉపాధ్యాయురాలు అచ్చి అమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్(జాగరూకత) అవగాహన వారోత్సవాల్లో భాగంగా పోలవరం జిల్లా గంగవరం మండలం లక్కొండ గ్రామంలో అవగాహన గ్రామసభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది ప్రజలకు సైబర్ నేరాలు ఆన్‌లైన్ మోసాలు ఆర్థిక భద్రత పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్ ద్వారా వ్యక్తిగత బ్యాంకు వివరాలను సేకరించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు ముఖ్యంగా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు బ్యాంకు రహస్య వివరాలను ఇతరులకు తెలియజేయకూడదని స్పష్టం చేశారు సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా బెదిరించినా భయపెట్టినా ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద లావాదేవీలు జరిగినప్పుడు వెంటనే బ్యాంకును సంప్రదించాలని సూచించారు చదువుకుంటున్న విద్యార్థులు,యువతను



లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతూ,బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు పిల్లలు,యువత ఆన్‌లైన్‌లో ఎవరితో మాట్లాడుతున్నారు ఎలాంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుంటున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు ప్రజల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడంలో భాగంగా తపాలా శాఖ అందిస్తున్న వివిధ పొదుపు,బీమా పథకాల గురించి వివరించారు ప్రతి కుటుంబం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని,కుటుంబానికి భరోసా కల్పించేలా బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు బాలికల భవిష్యత్తు కోసం ఉద్దేశించిన సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనాలను కూడా ప్రజలకు వివరించారు విజిలెన్స్ వారోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ అవినీతి,అక్రమాలు,మోసాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సాహం ఇవ్వకూడదని ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ సిబ్బంది,గ్రామపెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పీఓ డైరీ నిర్వహణ అత్యంత కీలకం

-ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి: కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు) ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ సూచించారు. ప్రిసైడింగ్ అధికారి హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి, సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలన్నారు.పోలింగ్ కేంద్రంలో జరిగే ముఖ్య సంఘటనలు, పోలింగ్ సమయాలు, ఎదురైన సమస్యలు, తీసుకున్న చర్యలను పీఓ డైరీలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు.పీఓలు, ఏపీఓలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి డీఎన్‌వీ రమణ, తహసీల్దార్ తేజస్విని, ఎంపీడీవో కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# అడ్డతీగలలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండల కేంద్రంలోని వాల్మీకి నగర్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిర్తివాడ రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హమాలీ సంఘం అధ్యక్షుడు బొండ్ల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని అందించిన మహర్షి వాల్మీకి గొప్పతనాన్ని, ఆయన బోధించిన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో హమాలీ సంఘం మేస్త్రి రాజబాబు, నడిగట్ల రమేష్, మాజీ ఎంపీటీసీ పుడిగి ఆదిలక్ష్మి, దంగేడి సత్తిబాబు, వాల్మీకి సంఘం నాయకులు సూర్యారావు, చోళ్ళ కృష్ణారెడ్డి, జీసీసీ హమాలీలు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# బరిమామిడిలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం



పోలవరం జిల్లా గంగవరం మండలం బరిమామిడి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుక లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె రాజుబాబు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా గొర్లె రాజుబాబు మాట్లాడు తూ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర ఆయన గొప్పతనం సమాజానికి అందించిన సందేశాలను వివరించారు వాల్మీకి మహర్షి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళులర్పించారు గ్రామంలో జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# గంగవరంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీ ఎన్నికల బరిలో నిలిచిన ఏడుగురు అభ్యర్థులకు సోమవారం పార్టీ బీ-ఫారాలను అందజేశారు మండలంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అభ్యర్థులకు కండువాలు కప్పి బీ-ఫారాలను అందించి ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు,మాజీ ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి,పార్టీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు,గంగవరం మండల ఇన్‌చార్జి సీహెచ్ రఘునాథ్,జడ్పీటీసీ అభ్యర్థి బల్లెం శివదొర ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేశారు.

**బీ-ఫారాలు అందుకున్న ఎంపీటీసీ అభ్యర్థులు**

1. మద్దేటి వెంకటలక్ష్మి - మోహనాపురం,2. సారపు వెంకటలక్ష్మి - ఆముదాలబంధం,3. మడకం శివదొర - లక్కొండ,4. పేరు బాలురెడ్డి - మర్రిపాలెం,5. వెదురుపల్లి మేనక భార్గవి - నెల్లిపూడి,6. చోడి బాపనమ్మ - సూరంపాలెం,7. కుంజం పాప - మొల్లేరు,ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో నిర్వహిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కామరాజు దొర,మడకం వెంకటేశ్వర్లు దొర,పార్టీ నాయకులు మద్యేట రామకృష్ణ మండల బూత్ కమిటీ కన్వీనర్ శివరామకృష్ణ,ఐటీ విభాగం కన్వీనర్ బైర బాబి,ఎస్ఎస్ఎల్ విభాగం కన్వీనర్ నిడమర్తి రమేష్,పీసా ఉపాధ్యక్షుడు దొంగబాబు,నాయకులు ప్రవీణ్,వెంకన్న,అనిల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్నాబ్ తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

❖ 27, 28 తేదీల్లో అత్యవసరమైతేనే బయటకు రావాలి ❖ ఆ తేదీలలో పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవులు ❖ లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి ❖ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

అర్నాబ్ తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లాలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి 28వ తేదీ వరకు భారీ వర్షాలు, గంటకు 115 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ప్రజలు అధికారులకు సహకరించి భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, తుపాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు వీలైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దని, చెట్ల కింద నిలబడవద్దని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రభావిత ప్రాంతాలు, కచ్చా ఇళ్లలో నివసించే ప్రజల భద్రత కోసం 273 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది ముందస్తుగా తరలివెళ్లాలని సూచించినప్పుడు ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. తుపాను సమయంలో పునరావాస కేంద్రాలకు తరలివెళ్లడంలో జాప్యం చేయడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చ రించారు. బలమైన గాలుల కారణంగా చెట్లు కూలి రహదారులకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున వాటిని తక్షణమే తొలగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన చోట్ల వినియోగించేందుకు పవర్ సా యంత్రాలు, జేసీబీలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి సబ్‌స్టేషన్ వద్ద అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, నైపుణ్యం కలిగిన సిబ్బందిని అందుబాటులో ఉంచామని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రోడ్లపై వరద నీరు ప్రవహించడం, రహదారులపై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గమనించాలని, నీరు ప్రవహిస్తున్న రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వరద ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ప్రజలకు సూచించారు.తుపాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర సమాచారం, సహాయం కోసం కింది నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు.

అదేవిధంగా ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుత సమాచారం ప్రకారం బాపట్ల నుంచి విశాఖపట్నం మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉన్నప్పటికీ, అది ఎక్కడ తీరం దాటుతుందనే విషయంలో స్పష్టత లేదని కలెక్టర్ పేర్కొన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా అత్యంత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.



కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:-
జిల్లా కలెక్టరేట్: 08672-252399-
ఆర్డీవో కార్యాలయం, మచిలీపట్నం: 08672-252486
- ఆర్డీవో కార్యాలయం, ఉయ్యూరు: 08676-232589
- ఆర్డీవో కార్యాలయం, గుడివాడ: 08674-243698




## దక్షిణ చిరువోల్లంక నుంచి విక్కుర్తి జయలక్ష్మి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

ప్రజాప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా కూటమి పార్టీలు బలపరిచిన అవనిగడ్డ మండల తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి విక్కుర్తి జయలక్ష్మి సోమవారం ఉదయం దక్షిణ చిరువోల్లంక గ్రామం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దక్షిణ చిరువోల్లంక సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి లంకమ్మ ప్రసాద్‌తో కలిసి ఆమె ప్రచార కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా అభ్యర్థులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తోందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి కృషి చేస్తోందని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో స్థానిక సంస్థల్లో బాధ్యతలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కూటమి అభ్యర్థి గీతచరణ్ విస్తృత ప్రచారం

### ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించిన జనసేన అభ్యర్థి

ప్రజాభూమి మచిలీపట్నం ప్రతినిధి :



నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో మచిలీపట్నం నగరంలోని 1వ డివిజన్‌లో రాజకీయ సందడి నెలకొంది. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన వంపుగడవల గీతచరణ్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన డివిజన్ పరిధిలో సోమవారం విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలను, ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో తనను ఆదరించి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. డివిజన్‌లోని ప్రజలతో మమేకమవుతూ వారి ఆదరాభిమానాలను పొందేందుకు కృషి చేశారు. ఎన్ని కల్లో తనకు అవకాశం కల్పించాలని, ప్రజల మద్దతుతో విజయం సాధించేలా సహకరించాలని ఓటర్లను కోరుతూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా గీతచరణ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మురుగునీటి వ్యవస్థను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు నిర్వహిస్తామని, ప్రతి వీధికి సిసి రోడ్లు వేసి వీధి దీపాలతో అలంకరిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందే విధంగా కృషి చేస్తామని అన్నారు.స్థానిక నాయకులు, జనసేన పార్టీ శ్రేణులు, కూటమి మద్దతుదారులతో కలిసి గీతచరణ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా ఓటర్లను నేరుగా కలుసుకుంటూ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఈ కార్యక్రమంలో వంపుగడవల చౌదరి, రాజా హక్కుమంతి, బత్తిన దాసు, ఎన్నింటి గణేష్, శీలం శశాంక్, శీలం నాయుడు, మాకాల ప్రసాద్, జగన్మోహన్ రావు, పళ్లెం రాఘవరావు పాల్గొన్నారు.

## కృష్ణా విశ్వవిద్యాలయంలో శిక్షణా కార్యక్రమం ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం,కృష్ణా విశ్వవిద్యాలయం:

కృష్ణా యూనివర్సిటీ ఆడిటోరియంలో 21వ సెంచరీలో స్కిల్స్ - లైఫ్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ మరియు కెరీర్ గైడెన్స్ అనే అంశంపై ఎనిమిది రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభ మైంది. విశ్వవిద్యాలయంలోని యూజీ ప్రొఫెషనల్, పీజీ, పీజీ ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకు లపతి ఆచార్య కె. రాంజీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో మ్యా జి క్ బస్ ఇండియా ఫౌండేషన్ సమన్వయకర్త అలీ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. కోటేశ్వరరావు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై. కె. సుందర కృష్ణ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాంబాబు పాల్గొన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలు, కెరీర్‌పై అవగా హన, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణ అందించనున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి, వృత్తిపరంగా అభివృద్ధి చెంద డానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు.

# మచిలీపట్నం సమగ్రాభివృద్ధే కూటమి ధ్యేయం



❖ ప్రజలకు మేలు చేసే కూటమి అభ్యర్థికి మద్దతివ్వండి ❖ బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, పోర్ట్ మరియు పారిశ్రామికాభివృద్ధి ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులతో మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా గారితో కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అబ్దుల్ అబీదా గారిని, 60 డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మేయర్ అభ్యర్థి అబీదా గారి మామగారు దివంగత కలీం బేగ్ గారు బందరు ప్రజలకు నిబద్ధతతో సేవ చేశారు. వారి కుమారుడు హసీం బేగ్ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ పూర్తి చేసి, ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి పెద్దలు ఆలోచించి, చదువుకున్న మైనారిటీ మహిళ అయిన అబీదాని మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

2014-19 మధ్య కాలంలో బందరు పట్టణంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించామని గుర్తు చేశారు. వర్షపు నీరు, మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ. 100 కోట్లతో ప్రారంభించిన డ్రైనేజీ పనులను, అధునాతన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు మరియు పంపింగ్ సిస్టమ్స్ ద్వారా శాశ్వతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సాయిబాబా గుడి వద్ద కల్వర్ట్ నిర్మాణం, పైప్‌లైన్లు మరియు కేబుల్స్ డైవర్షన్ ద్వారా రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసి, చారిత్రక ప్రాధాన్యత కలిగిన జిల్లా కోర్టు వరకు రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. రూ.2.60 కోట్లతో ధర్మం చెరువు అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. రూ.7.50 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టాం. ఫీనక్స్ సంస్థ మరియు సిఎస్ ఆర్ నిధులతో పట్టణంలో శ్మశాన వాటికలను అధునికీకరిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మచిలీపట్నం పోర్ట్ అందుబాటులోకి వస్తుంది. పోర్టుకు అనుబంధంగా రూ. 8,000 కోట్ల పెట్టుబడితో దాదాపు 10,000 మందికి ఉపాధి కల్పించేలా గోవా షిప్‌యార్డ్ ఏర్పాటు కాబోతోంది. మచిలీపట్నంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా గతంలో బందర్ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. సముద్ర తీరంలో 63 అడుగుల మహాగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించాం. అదే సమయంలో రిసార్ట్‌లు, గోల్ఫ్ కోర్ట్‌ల నిర్మాణాలకు అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. లాయర్ల రక్షణ చట్టం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే. అలాంటి ప్రభుత్వానికి న్యాయవాదులు కూడా అండగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఇతర సీనియర్ పార్టీ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆశ్వీజ పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

### మచిలీపట్నం ప్రాంతం సుభిక్షంగా ఉండాలని అఖండ దీపారాధన.. అనంతరం 32, 33 డివిజన్లలో కూటమి అభ్యర్థుల ప్రచారం..



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ఆశ్వీజ పౌర్ణమి సందర్భంగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జలాల్‌పేట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అఖండ దీపారాధన, ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్, మచిలీపట్నం కూటమి పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి డాక్టర్ హసీం బేగ్, కూటమి పార్టీల నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీద, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి పార్టీల కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మచిలీపట్నం ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం 32, 33 డివిజన్లలో కూటమి పార్టీల అభ్యర్థులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మచిలీపట్నం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, నగర అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొంటూ, నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి పార్టీల మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదతో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.




## ప్రజా సమస్యలే ఎజెండాగా కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా ప్రచారం

### బీసీ సంఘం నాయకులు, కార్‌స్టాండ్ సభ్యులతో భేటీ.. చిరు వ్యాపారుల కష్టాలు తెలుసుకుని అండగా ఉంటామని హామీ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని బస్టాండ్ పరిధిలో ఈడేపల్లి బీసీ సంఘం నాయకులు, మరియు కార్ స్టాండ్ సభ్యులను కలిసి కూటమికి మద్దతు తెలపాలని, తమ అమూల్యమైన ఓటును కూటమి అభ్యర్థులకు వేసి విజయాన్ని చేకూర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్‌స్టాండ్ సభ్యులతో ఆమె మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల ఆదరాభిమానాలతోనే నగర అభివృద్ధికి మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం లభిస్తుందని పేర్కొంటూ, ఎన్నికల్లో కూటమికి అండగా నిలవాలని కోరారు. వివిధ వర్గాల ప్రజల మద్దతుతో ప్రచారాన్ని ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

**చిరు వ్యాపారుల కష్టాలు తెలుసుకుంటూ..**అనంతరం మచిలీపట్నం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన అబ్దుల్ అబీదా, రోడ్డు పక్కన హోటళ్లు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, కు టుంబ పోషణ కోసం వారు పడుతున్న శ్రమను తెలు సుకుని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇ చ్చారు. చిరు వ్యాపారులు నగర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. సామాన్య ప్రజలు, చిన్న వ్యాపా రుల సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాసేవలో ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు.

**నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యం...**మచిలీపట్నం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని అబ్దుల్ అబీదా తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉం టూ, వారి సమస్యలను తెలు సు కుని పరిష్కార దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారులతో కలుస్తూ సాగిన ఆమె ప్రచారానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. కూటమి విజయమే లక్ష్యంగా 'జయహో' నినాదాలతో అబ్దుల్ అబీ దా ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. ప్రజల మద్దతుతో నగరాభివృద్ధికి కృషి చేస్తాననే సందేశాన్ని ఆమె తన ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.



## కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా వి. అభిషేక్ నియామకం

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజిని మర్యాదపూర్వకంగా కలిసిన సాధారణ పరిశీలకులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

2026రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెండో సాధారణ పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా ఐఏఎస్ అధికారి, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి. అభిషేక్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.గతంలో కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా నియమితులైన ఐఏఎస్ అధికారి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు నియామక ఉత్తర్వులను పాక్షికంగా సవరిస్తూ, ఆయన స్థానంలో వి. అభిషేక్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నేపథ్యంలో, నూతనంగా నియమితులైన జిల్లా సాధారణ పరిశీలకులు వి. అభిషేక్, మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## మచిలీపట్నం నగర పాలక సంస్థ సాధారణ ఎన్నికలు .. మీ పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోండి ఇలా..

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం నగర పాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో, ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వివరాలను ముందుగానే తెలుసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పించింది. ఓటర్లు కింది లింక్ ద్వారా తమ పోలింగ్ కేంద్రం వివరాలను సులభంగా తెలుసు కోవచ్చు

:https://sec-ems.ap.gov.in/ apsec/ get Know Your PSGP Details

తెలుసుకునే విధానం:

పై లింక్‌ను మొబైల్ లేదా కంప్యూటర్‌లో ఓపెన్ చేయాలి. అడిగిన వివరాలను (ఓటరు వివరాలు / వార్డు వివరాలు) నమోదు చేయాలి.మీ పోలింగ్ కేంద్రం పేరు, చిరునామా తెరపై కనిపిస్తాయి.కావున మచిలీపట్నం నగర ఓటర్లందరూ ఎన్నికల రోజుకు ముందే తమ పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకుని, ఎటువంటి ఇబ్బంది లేకుండా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని , ఈ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి కూడా తెలియజేయాలని అదికారులు తెలిపారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

ప్రజాభూమి
జనరల్

మంగళవారం 27 అక్టోబర్ 2026

# క్రిమినల్స్‌ను తయారు చేసే ఫ్యాక్టరీలా వైసీపీ

- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు.
- 16వ ఆర్థిక సంఘం నిధులను అడ్డుకోవడమే లక్ష్యం
- వైసీపీ అధినేత జగన్‌పై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తీవ్ర విమర్శలు



**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిమినల్స్‌ను తయారు చేసే ఫ్యాక్టరీలా తయారైందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసిందల్లా శవ రాజకీయాలేనని, రాజకీయ విలువలు తెలియవని ఎమ్మెల్యే ఆరోపించారు. అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులనే రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుంటే వాటిని అడ్డుకునేందుకు వైసీపీ అనేక కుట్రలకు తెరలేపుతోందని అన్నారు. తమ నామినేషన్లను తామే చింపుకుని, అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని సత్యానందరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే కేంద్రం నుంచి 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రూ.12,600 కోట్ల నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని, ఆ నిధులు రాకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికలకు ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

**పోలీసులపైనా దాడులు దుర్మార్గం**

శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులపైనా, కూటమి నాయకులపైనా వైసీపీ దాడులకు పాల్పడుతూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చాలని చూస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. శాంతిభద్రతల గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలు, దౌర్జన్యాలు, అరాచకాలు ఎలా జరిగాయో ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు.

**జగన్ తీరును ప్రజలు గమనిస్తున్నారు**

తండ్రి తర్వాత తండ్రిగా భావించే మేనమామ స్థానంలో ఉండి మేనకోడలి పెళ్లికి యలహంక ప్యాలెస్ ఇవ్వకుండా కంస మామ మాదిరిగా జగన్ ఇబ్బందులు పెడుతున్నారంటూ ఎమ్మెల్యే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏకగ్రీవాలు జరిగిన ప్రాంతాల్లోని నియోజకవర్గ నాయకులకు సీటు ఇవ్వబోనని గతంలో జగన్ చెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుతం పులివెందులలో 20 వార్డులు, ఆ జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు ఏకగ్రీవం అయిన నేపథ్యంలో జగన్ కూడా ఎన్నికల నుంచి తప్పుకుంటారా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని సత్యానందరావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న వైసీపీ 2029 ఎన్నికల్లో పూర్తిగా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. ప్రతిపక్ష పార్టీగా బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని హితవు పలికారు.

**కూటమి అభ్యర్థులను గెలిపించాలి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తపేట నియోజకవర్గం నుంచి కూటమి తరపున జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిని ఎమ్మెల్యే అభినందించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట ఏఎంసీ ఛైర్మన్ పల్లి మంగాదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.వి. సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, ఆత్మ కమిటీ ఛైర్మన్ జక్కంపూడి బాలాజీ, గుత్తుల పట్టాభిరామారావు, పల్లి భీమారావు, రాచకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఏలూరు అభివృద్ధికి తనను గెలిపించండి

- ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థి పెరికే దినా గ్లాడి విజ్ఞప్తి

**ప్రజాభూమి ఏలూరు**

నగర అభివృద్ధి కోసం ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెరికే దినా గ్లాడి కోరారు.సోమవారం లంకపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ,మేయర్ పదవి బీసీలకు రిజర్వ్ అయినప్పటికీ బీసీ (సీ) వర్గానికి రాజకీయ పార్టీలు అవకాశం కల్పించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.గతంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించానని,కరోనా సమయంలో పెరికే ఫౌండేషన్ ద్వారా అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ప్రజలు అవకాశం కల్పిస్తే ఏలూరును గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ టీం వ్యవస్థాపకులు బిషప్ కారుపాటి శాంతిసాగర్ మాట్లాడుతూ,బ్యాలెట్ పేపరులో 9వ నంబరులో ఉన్న కప్ అండ్ సాసర్ గుర్తుకు ఓటు వేసి పెరికే దినా గ్లాడిని గెలిపించాలని కోరారు.మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఏ.వి. పటేల్ మాట్లాడుతూ, ఎస్సీ,బీసీ,మైనార్టీలు ఐక్యంగా ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెరికే వరప్రసాద్,డాక్టర్ వి. రాజేంద్రప్రసాద్,రెవరెండ్ బీరపోగు యోహాన్,తేళ్ల శ్యాంబాబు,పాస్టర్ పి.వి. రాజు,బేతేలు రమేష్ పాల్గొన్నారు.

# తుఫాను ముందస్తు చర్యలపై అప్రమత్తత

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి ఎంపీడీవో, తహశీల్దార్

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట**

తుఫాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం, సంభవించే నష్టాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను కారణంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడం, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లోని లోతట్టు, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, ప్రమాదకరమైన చెట్లు, విద్యుత్ స్తంభాలు తదితర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, మురుగునీటి కాలువల్లోని అడ్డంకులను తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులపై చెట్లు లేదా ఇతర అడ్డంకులు పడిన సందర్భంలో వెంటనే తొలగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తుఫాను కారణంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించేలా సంబంధిత సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తుఫాను ప్రభావానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం, నష్టం వివరాలు, చేపట్టిన సహాయక చర్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతలను నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసానికి నాంది



**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**

అడవినెక్కలం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం బెంగళూరులో అమెజాన్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న చలసాని పద్మ పాఠశాలపై అభిమానంతో సుమారు రూ.10 వేల విలువైన పుస్తకాలను అమెరికా నుంచి తెప్పించి గ్రంథాలయానికి ఉచితంగా బహూకరించారు. విద్యార్థుల్లో విజ్ఞానం, పఠనాసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందించినట్లు ఆమె తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర విజ్ఞాన పుస్తకాలను చదవడం భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పద్మ తండ్రి మాదల జనార్దనరావు ఈ పుస్తకాలను పాఠశాలకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.వి. రమణ మాట్లాడుతూ, ఈ పుస్తకాలు విద్యార్థుల్లో విజ్ఞానం, పఠనాసక్తి, నైపుణ్యాల పెంపునకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తుఫాను ముప్పు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు సహకరించాలి.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు
- రెస్క్యూ చర్యలకు పోలీస్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**ప్రజా భూమి ప్రతినిధి – అనకాపల్లి**

రాబోయే 'అర్నాబ్' తుఫాను తీవ్రత దృష్ట్యా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమైందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తీరప్రాంత, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పోలీస్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**రెస్క్యూ బృందాలు సిద్ధం**

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీస్ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు (క్యూఆర్‌టీ) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. తుఫాను ముప్పు తొలగిపోయే వరకు పోలీస్ సిబ్బంది, అత్యవసర సేవల అధికారులు అందుబాటులో ఉండాలని, సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించారు.

**పునరావాస కేంద్రాలకు తరలింపు**

లోతట్టు ప్రాంతాలు, తీరప్రాంతాల్లో నివసించే ప్రజలను రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైనప్పుడు సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన భోజనం, ఇతర నిత్యావసర సదుపాయాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు.

**వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు**

తుఫానుకు సంబంధించి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు అనధికారిక సమాచారాన్ని నమ్మకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖలు విడుదల చేసే అధికారిక హెచ్చరికలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఎస్పీ సూచించారు. కూలిపోయే ప్రమాదం ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో నిలబడరాదన్నారు. తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, కాజ్‌వేలు, వరద నీరు చేరిన రహదారులను దాటేందుకు ప్రయత్నించరాదన్నారు. ముందస్తుగా తాగునీరు, నిల్వ ఉండే ఆహార పదార్థాలు, నిత్యావసర మందులు, టార్చ్‌లైట్లు సిద్ధం చేసుకోవాలని, మొబైల్ ఫోన్లను పూర్తిగా ఛార్జింగ్ చేసుకుని ఉంచుకోవాలని సూచించారు.

**అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయండి**

తుఫాను సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే ప్రజలు వెంటనే పోలీస్ ఎమర్జెన్సీ నంబర్ 112 లేదా 100కు ఫోన్ చేసి సహాయం పొందాలని ఎస్పీ సూచించారు. ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# అవినీతి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

- ఏసీబీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**ప్రజా భూమి ప్రతినిధి – అనకాపల్లి**

అవినీతిని నిర్మూలించి, పారదర్శక పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రూపొందించిన అవగాహన పోస్టర్లను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాజంలో అవినీతి రహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రజల్లో అవగాహన, చైతన్యం అవసరమని పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

**లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగినప్పుడు ప్రజలు కింది సంప్రదింపు వివరాల ద్వారా ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చు.

- టోల్‌ఫ్రీ నంబర్: 1064




- వాట్సాప్ నంబర్: 94404 40057
- ఈ–మెయిల్: complaints-acb@ap.gov.in
- ఫోన్ నంబర్: 0866–2428770

వినీతికి సంబంధించిన సమాచారాన్ని ఏసీబీ అధికారులకు తెలియజేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.ఎస్. రమణమూర్తి, అనకాపల్లి ఎస్‌బీ సీఐ బాల సూర్యారావు, ఏసీబీ సీఐ సీహెచ్. వెంకట్రావు, ఏసీబీ, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ



**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**

తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై పీవో, ఏపీవో సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయ రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అయితే, సుమారు 105 మంది హాజరైనప్పటికీ శిక్షణకు కేటాయించిన హాల్ ఇరుకుగా ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శిక్షణ ఆలస్యంగా ప్రారంభం కావడంతో పాటు కుర్చీలను సైతం తామే సర్దుకోవాల్సి వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో సిబ్బంది హాజరయ్యే కార్యక్రమాలను విశాలమైన ప్రదేశంలో నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.



## తోడెం వీరాస్వామి మృతి పట్ల ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంతాపం

- కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెం గ్రామంలో విషాదం నెలకొనడంతో మృతుని కుటుంబాన్ని పోలవరం శాసనసభ్యులు పరామర్శించారు. జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బంధువు తోడెం వీరాస్వామి ఆకస్మికంగా మరణించడంతో, సోమవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వారి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మృతుడు వీరాస్వామి భౌతిక మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తోడెం వీరాస్వామి మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాప రవి, కుంజా రాంబాబు,బంధువులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి కాండేట్లకు బీఫారాలు అందజేత



ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

కామవరపుకోట మండలంలోని వైస్సార్సీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు వైస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో చింతలపూడి నియోజకవర్గం ఇంచార్జ్ కంభం విజయరాజు చూచనల మేరకు కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ చేతుల మీదగా బి.ఫార్మ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు, నియోజకవర్గం నాయకులు, మండల నాయకులు, గ్రామ, వార్డ్ నాయకులు పాల్గొన్నారు.

## మాగంటి బాబు దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



ప్రజాభూమి ఏలూరు

తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, జనసేన పార్టీ చీఫ్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ఏలూరులోని మాగంటి నిలయంలో మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), మాగంటి పద్మవల్లీ దేవి దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కామవరపుకోట జెడ్పీటీసీగా కూటమి అభ్యర్థి మాగంటి పద్మవల్లీ దేవి భారీ మెజారిటీతో విజయం సాధించి,ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు.మాగంటి బాబు దంపతులతో ఉన్న సాన్నిహిత్యం,వారి కుటుంబం పట్ల గౌరవంతో అభినందనలు తెలిపేందుకు వచ్చినట్లు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## 44 వార్డుల పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలు ప్రచురించాం

- అభ్యంతరాలు 27వ తేదీలోగా తెలపాలి
- మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో పునర్విభజన, నూతన గ్రామాల విలీనం తర్వాత మొత్తం 44 వార్డులకు సంబంధించి రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు చైర్పర్సన్, వార్డు కౌన్సిలర్లు కు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలను ప్రచురణ చేయడం జరిగిందని, వాటిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న 27 వ తేది సాయంత్రం 5 గం. లోపు తెలపాలని మున్సిపల్ కమిషనర్ డి కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 27వ తేదీ ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీ నేతలతో పురపాలక సం కార్యాలయం సమావేశం మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి అభ్యంతరాలు ఏమైనా ఉంటే జిల్లా కలెక్టర్ కి నివేదిస్తామని తెలిపారు. మొత్తం 77, 478 ఓటర్స్ ఉన్నారని, అందులో 37, 191 మంది పురుషులు, 40, 279 మంది స్త్రీలు, 8 మంది ఇతరులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ వివరాల ప్రచురణ జాబితాను ఆర్డిఓ, పురపాలక సంఘ కార్యాలయం, తాసిల్దార్, ఎంపీడీవో, సచివాలయ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితా ప్రతు లను సిబ్బంది తో కలిసి విడుదల చేసినట్లు వివరించారు.కావున ఈ వివరాలను ఓటర్లు, ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలుసుకుని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కమిషనర్ కిరణ్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

## చాంబర్స్ విద్యార్థి జె.రవి సూర్య గణేష్‌కి పాలకొల్లు 10 కే రన్‌లో తృతీయ బహుమతి

- అభినందించిన కళాశాల యాజమాన్యం

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు




చాంబర్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం బిఎస్సి కంప్యూటర్ చదువుతున్న జె రవి సూర్య గణేష్ కు 5కే రన్ విభాగంలో తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాడని కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలియజేసినారు. శివ సూర్య నిరంతరం క్రమశిక్షణతో రోజు పరుగు చేయటం క్రమశిక్షణ కలిగిన ఎన్సిసి క్యాడేట్ కూడా అని విద్యార్థులు రవి సూర్య లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి క్రమం తప్పకుండా లక్ష్యాన్ని ఎంచుకొని ప్రయత్నిస్తే విజయంసాధించవచ్చునని, ఒకపక్క అకాడమిక్ గాను, కల్చరల్ గాను, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నందు తమ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా తమ విద్యార్థులు ఈ విజయాలను సాధిస్తున్నారని అన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 3000 మంది హాజరై ఈ ఈవెంట్లో తమ విద్యార్థికి తృతీయ బహుమతిరావడంసంతోషాదాయకమన్నారు.ఈ సందర్భంగా జె.రవి సూర్యను పుష్పగుచ్చంతో కళాశాల యాజమాన్యం సత్కరించింది.

ఈ కార్యక్రమంలో సెక్రటరీ కేవీ సీతారామరాజు, ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భావన, అకాడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఎబిఎస్ మూర్తి, ఎం సీతారామ రావు, అధ్యాపకులు ఎన్ రవికుమార్ రాంబాబు రాము రాధ మాధవి తదితరులు మరియు విద్యార్థులు అభినందించారు.

## జోరుగా 22వ వార్డులో కూటమి అభ్యర్థిని జాస్తి విజయలక్ష్మి ప్రచారం

- 22వ వార్డులో బ్రహ్మరథం పడుతున్న ఓటర్లు
- చేసిన అభివృద్దే ప్రచార అస్త్రంగా అభ్యర్థిని విజయలక్ష్మి ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి రామచంద్రపురం



రామచంద్రపురం పురపాలక సంఘం ఎన్నికల్లో భాగంగా 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన అభ్యర్థి జాస్తి విజయలక్ష్మికి తెలుగుదేశం పార్టీ తరపున బి. ఫామ్ ఇవ్వడంతో ఆ వార్డులో జాస్తి విజయలక్ష్మి కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం కొనసాగిస్తున్నారు.ఆవార్డులో ఆమె నిర్వహిస్తున్న ఇంటింటా ప్రచారానికి స్థానిక ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోంది. వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. మహిళలు విక్టరీ సింబల్ చూపిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జాస్తి విజయలక్ష్మి మాట్లాడుతూ, 22వ వార్డు అభివృద్దే తన ప్రధాన లక్ష్యమని, మహిళా సమస్యల పరిష్కారానికి, వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఓటమి బలపరిచిన మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుకు,22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థినిగా అవకాశం ఇచ్చిన తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సందర్భంగా అభ్యర్థిని జాస్తి విజయలక్ష్మి కోరారు. తనకు అవకాశం కల్పించిన కూటమి నాయకత్వానికి, మంత్రి సుభాష్ కి, సత్యం ఫౌండేషన్ అధినేత సత్యం కి, జనసేన నేత పోలిశెట్టి చంద్రశేఖర్ కి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు చేయూత

- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సెల్ అడ్వైజరు ఎం.ఏ.షరీఫ్

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు



నూజివీడు మున్సిపల్ ఎన్నికలు ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలో కూటమిపార్టీ శ్రేణులు భారీర్యాలీని నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సెల్ అడ్వైజరు,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఏ.షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఆయనతో పాటు కూటమిపార్టీ బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బర్రె ఇళయరాజా, వివిధ వార్డులు కౌన్సిలర్లు అభ్యర్థులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లింమైనార్టీలు ప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగిన ఈ ర్యాలీకి ప్రజలు నుంచి, వ్యాపారులు నుంచి విశేష స్పందన లభించింది. ర్యాలీ అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో నేతలు ప్రసంగించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సెల్ అడ్వైజర్ ఎం.ఏ.షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం మరియు అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని పేర్కొన్నారు.సమాజంలో మైనార్టీలు ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం వేల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. నూజివీడు పట్టణ సమగ్ర అభివృద్ధి కూటమి అభ్యర్థులు గెలుపుతోనే సాధ్యమని స్పష్టం చేశారు. మైనార్టీలు అంతా ఏకతాటిపై నిలిచి చైర్మన్ అభ్యర్థి ఇళయ రాజాతో పాటు కౌన్సిలర్లు అభ్యర్థులు అందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి ఇళయరాజా మాట్లాడుతూ నూజివీడు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, తదితర మౌళిక వసతులు కల్పనకు చిత్తశుద్ధితో కృషిచేస్తామని హామీ ఇచ్చారు. తమను ఆశీర్వదించి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు.?ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ ముఖ్యనేతలు, పోటీలో కౌన్సిలర్లు, మైనార్టీసంఘాలు నాయకులు, వార్డునాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో మైనార్టీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

- ఏలూరు సర్కిల్ కార్యాలయంతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ఏలూరు జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, తుఫాన్ ప్రభావంతో తలెత్తే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.ఎం. అంబేద్కర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

**మూడు కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు**

తుఫాన్ ప్రభావిత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు, విద్యుత్ అంతరాయాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏలూరు సర్కిల్ కార్యాలయంతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

**కంట్రోల్ రూమ్‌ల సంప్రదింపు వివరాలు:**

1. ఏలూరు సర్కిల్ కార్యాలయం, విద్యుత్ భవన్, ఆర్.ఆర్.పేట, ఏలూరు: 9440902926
2. ఏలూరు డివిజన్ కార్యాలయం: 9440904037
3. జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయం: 9491030712

అదేవిధంగా, విద్యుత్ సంబంధిత ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా నమోదు చేయవచ్చని ఆయన సూచించారు.

**విద్యుత్ భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

తుఫాన్, భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కె.ఎం. అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగలను, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను, వంగిపోయిన లేదా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నేరుగా తాకరాదని హెచ్చరించారు. తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, వాటి సమీపంలోకి ఇతరులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే, వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలను తాకరాదని, తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు, పరికరాలను ఉపయోగించరాదని సూచించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీస్తుందని, అందువల్ల వ్యక్తిగత భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

**విద్యుత్ అంతరాయాలపై వెంటనే ఫిర్యాదు చేయండి**

భారీ వర్షాలు, ఈదురుగాలులు లేదా వరదల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, విద్యుత్ తీగలు తెగిపడినా, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నా లేదా ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినా ప్రజలు తమ సమీపంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని లేదా కింది నంబర్లను సంప్రదించి ఫిర్యాదు నమోదు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ కోరారు.

ఏలూరు సర్కిల్ కంట్రోల్ రూమ్ : 9440902926
ఏలూరు డివిజన్ కంట్రోల్ రూమ్: 9440904037
జంగారెడ్డిగూడెం డివిజన్ కంట్రోల్ రూమ్: 9491030712
విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ : 1912

ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సురక్షితమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రజల ప్రాణ భద్రతే విద్యుత్ శాఖకు అత్యంత ప్రాధాన్యం. విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తతో ఉండి, సురక్షితంగా ఉండాలని అంబేద్కర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తుపాను వేళ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో
# ముందస్తు చర్యలతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం!

- 303 మంది గర్భిణుల గుర్తింపు.. 65 మంది ఆసుపత్రులకు తరలింపు
- 1,860 యాంటీ స్నేక్ వెనం వయల్స్ సిద్ధం
- డి ఎమ్ హెచ్ వో డా. పి సరిత

**ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం**

అర్నబ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పోలవరం జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైందనీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా పి సరిత సోమవారం తెలిపారు.తుపాను ప్రభావంతో మారుమూల, కొండ ప్రాంతాల్లో రవాణాకు అంతరాయం ఏర్పడినా ప్రజలకు వైద్య సేవల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ కేంద్రాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలను పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 140 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ప్రసవ తేదీ మరో రెండు వారాల్లో ఉన్న 303 మంది గర్భిణులను గుర్తించగా, వారిలో 118 మంది ఇప్పటికే ప్రసవించారు. మరో 65 మందిని ముందస్తుగా ఆసుపత్రులకు తరలించగా, 120 మందిని తరలించాల్సి ఉంది. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సురక్షిత ప్రసవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బర్త్ వెయిటింగ్ హాళ్లలో ఉన్న గర్భిణులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. సరిత మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు.

**పాముకాటుకు తక్షణ చికిత్స**

తుపాను సమయంలో పాముకాటు ఘటనలు సంభవించే అవకాశం ఉన్నందున జిల్లాలో 1,860 యాంటీ స్నేక్ వెనం (ఏఎస్‌వీ) వయల్స్‌ను అందుబాటులో ఉంచారు. 108, 102, ఐటీడీఏ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఐదేళ్లలోపు 28,260 మంది చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంతో పాటు వృద్ధులు, మంచానికే పరిమితమైనవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ రోగులకు అత్యవసర వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**సహాయక కేంద్రాల్లో వైద్య బృందాలు**

తుపాను సహాయక కేంద్రాల్లో వైద్య, పారామెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచి అవసరమైన మందులు, వైద్య పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వ్యాక్సిన్ల భద్రత కోసం కోల్డ్‌చైన్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మందుల నిల్వలు, సిబ్బంది సంసిద్ధత, అత్యవసర వైద్య సేవలను పరిశీలించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, అంటువ్యాధుల నివారణలో ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని, తుపాను పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## పవనగిరి క్షేత్రంలో ఉచితంగా సత్యదీక్ష మాలలు
-నవంబర్ 4 నుంచి అన్నవరం సత్యదీక్షలు ప్రారంభం





**ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల**

పవనగిరి క్షేత్రానికి అన్నవరం సత్యదీక్ష మాలలు చేరుకున్నాయి. మంగళవారం నుంచి భక్తులకు ఉచితంగా మాలలు పంపిణీ చేయనున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట రామయ్య తెలిపారు.సోమవారం అన్నవరం దేవస్థానం ఏఈవో కృష్ణప్రసాద్ పవనగిరి క్షేత్రాన్ని సందర్శించి పవనగిరి స్వామీజీ దంపతులకు సత్యదీక్ష మాలలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 4 నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామివారి సత్యదీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పోలవరం జిల్లాలో దీక్ష చేపట్టాలనుకునే గిరిజనులు, భక్తులు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించి దీక్షా మాలలు, వస్త్రాలు తదితరాలను ఉచితంగా పొందవచ్చున్నారు.దీక్ష ప్రారంభ తేదీలు:లి 27 రోజుల దీక్ష: నవంబర్ 4 నుంచి 18 రోజుల దీక్ష: నవంబర్ 13 నుంచి 9 రోజుల దీక్ష: నవంబర్ 22 నుంచి మరిన్ని వివరాలకు 63029 39374 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పీఆర్వో కృష్ణప్రసాద్, సూపరింటెండెంట్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివచంద్ర ప్రసాద్,గంట విష్ణు, బల్లంకి రాజేంద్రకుమార్, సుబ్రమణ్యం, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసుకున్న 51 మంది కానిస్టేబుళ్లు
-విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తత తప్పనిసరి: ఎస్పీ కె. చక్రవర్తి



**ప్రజా భూమి ప్రతినిధి-పోలవరం జిల్లా**

తొమ్మిది నెలల పోలీస్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 51 మంది నూతన రిక్రూట్ కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సోమవారం పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, ఐపీఎస్‌ను కలిసి సూచనలు, సలహాలు పొందారు. వీరిలో 33 మంది పురుషులు, 18 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల నేపథ్యంలో అప్రమత్తంగా, క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ మహిళలు, చిన్నారులతో సహా ప్రజలందరి పట్ల గౌరవంగా వ్యవహరించాలని తెలిపారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, బందోబస్తు, పండుగలు, వీఐపీ, ఎస్కార్ట్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, విధుల్లో అప్రమత్తత పాటిస్తూ సంబంధిత అధికారుల సూచనల మేరకు వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ పోలీస్ శాఖకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ జావలి, డీఎస్పీ అష్రఫ్ అలీ, ఏఆర్ డీఎస్పీ సీతారాముడు, సీఐ గోపి నరేంద్ర ప్రసాద్, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాయం చంద్రమ్మ మృతి.. సీపీఎం నేతల నివాళి



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం**

వి.ఆర్.పురం మండలం సున్నంవారిగూడెం గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్త పాయం చంద్రమ్మ (వయస్సు వివరాలు తెలియదు) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు మృతి చెందారు. ఆమె మృతదేహానికి సీపీఎం సున్నంవారిగూడెం గ్రామశాఖ కార్యదర్శి సున్నం ముత్తమ్మ, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మలు పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంతాప సభకు సున్నం రంగమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ మాట్లాడుతూ పాయం చంద్రమ్మ చిన్న వయసులోనే సీపీఎం పార్టీలో చేరి, ప్రజా సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. పోలవరం పోరాటంతో పాటు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గ్రామాల్లో మంచినీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన పలు ఆందోళనల్లో ఆమె క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. చంద్రమ్మ మృతి సీపీఎం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, మంచి మార్క్సిస్టు కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. పార్టీ కార్యకర్తలు భౌతికంగా దూరమైనప్పటికీ ప్రజల హృదయాల్లో అమరజీవులుగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సున్నం వెంకటమ్మ, సున్నం దుర్గ, సున్నం శాంతకుమారి, సున్నం మంగమ్మ, దేశమ్మ తదితరులు పాల్గొని చంద్రమ్మకు నివాళులర్పించారు.

## తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### మూడు రోజుల పాటు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి: సీఐ గజేంద్ర కుమార్

**ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల**

అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో అడ్డతీగల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గజేంద్ర కుమార్ సూచించారు. రానున్న మూడు రోజుల పాటు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, మండల పరిధిలోని జలపాతాలు, వాగుల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.భారీ వర్షాల కారణంగా రహదారులకు అడ్డంగా చెట్లు పడినా, కొండచరియలు



విరిగిపడినా లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**అత్యవసర సంప్రదింపు నంబర్లు**

సీఐ గజేంద్ర కుమార్: 9440900768,
ఎస్ఐ: 9440900769,
పోలీస్ కంట్రోల్ రూమ్: 9441290132ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

## అడ్డతీగలలో 11 మంది ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ
### మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో గడువు పూర్తి



**ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల**

అడ్డతీగల మండలంలో సోమవారం 11 మంది ఎంపీటీసీ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి కె.రమణ తెలిపారు.అడ్డతీగల-1 నుంచి ఒకరు, అడ్డతీగల-2 నుంచి ఇద్దరు, ధాన్యం పాలెం, వేటమామిడి, వీరవరం, బొడ్లంక స్థానాల నుంచి ఒక్కొక్కరు, సోమన్నపాలెం, దొరమామిడి,స్థానాల నుంచి ఇద్దరేసి చొప్పున నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు.అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం చివరి తేదీ అని కె.రమణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చున్నారు. గడువు ముగిసిన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

## అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి
### బిజెపి సీనియర్ నేత అయ్యాజీ వేమా.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

రామచంద్రపురం పట్టణ అభివృద్ధి కోసం కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బిజెపి సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా కోరారు. ఈ మేరకు ఆయన పట్టణంలో ఏడవ వార్డుకు చెందిన బిజెపి అభ్యర్థి రాయుడు మణికంఠ తరపున ప్రచారానికి బిజెపి సీనియర్ నేతలు కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బిజెపి సీనియర్ నేత దొరబాబు తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా అయ్యాజీ వేమా మాట్లాడుతూ రామచంద్రపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం జనసేన పార్టీలు కలిసి ఎన్నికలలో పోటీ చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విషయంలో కంకణం కట్టుకుని సిఎం చంద్రబాబు నాయుడు , ఉప సీఎం పవన్ కళ్యాణ్ , ఆలిగే అభివృద్ధి కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ లక్షలాది కోట్లాది రూపాయలతో రాష్ట్ర రాజధాని అమరావతి కోసం ఏ రకంగా అభివృద్ధి చేశారో, అదేవిధంగా రామచంద్రపురం మున్సిపాలిటి అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సుభాష్ రామచంద్రపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కంకణ కట్టుకుని పనిచేస్తున్నారని అన్నారు .ఇక్కడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించిన మేడిశెట్టి శేషారావుకి సైకిల్ గుర్తు పైన ఏడవ వార్డు బిజెపి అభ్యర్థి రాయుడు మణికంఠకు కమలం గుర్తు పైన ఓటేసి గెలిపించాలని కోరారు. ఇప్పటికే కారడవుల్లా ఉన్న మారుమూల ప్రాంతాల్లో రహదారులు నిర్మించి గత ప్రభుత్వ హయాంలో చేయనటువంటి అభివృద్ధి లక్షల కోట్ల రూపాయలతో రహదారుల నిర్మించడం జరిగిందన్నారు . ఏడవ వార్డు అభ్యర్థి మణికంఠ మాట్లాడుతూ స్థానిక వార్డులో సమస్యలే ప్రధాన లక్ష్యంగా తాను పనిచేస్తానని తనకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని స్థానిక వాటర్లను అభ్యర్థ మణికంఠ కోరారు. ఈ ప్రచారంలో పట్టణ బిజెపి శ్రేణులతో పాటు స్థానిక ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్నాబ్ 'తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా పనిచెయ్యాలి
### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

'అర్నాబ్' తుఫాను సహాయక కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడింపచేసేలా అధికార యంత్రాంగం పనిచేయ్యాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులతో సోమవారం వర్చువల్ విధానంలో సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ 'అర్నాబ్' తుఫాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు, ముంపు ప్రమాదం ఉన్న ప్రతీ ప్రాంతంలోని ప్రజలను, లోతట్టు ప్రాంతాలు ప్రజలను అప్రమత్తం చేసి అవసరం మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే గ్రామాలుపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎక్కడా ఎటువంటి ప్రాణ,ఆస్తి, మూగజీవాలు, పంటనష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.సహాయక చర్యల్లో ఎటువంటి లోపాలు లేకుండా ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయ్యాలని, నిర్లక్ష్యం వహించకుండా అధికారులు అప్రమత్తంగా ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.వరద నీటిలో మునిగిన పంటను కాపాడుకునే చర్యలుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వాగులు, డ్రైన్లలో చెత్తను వెంటనే తొలగించి వరద నీరునిలిచి పోకుండా



ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పెనుగాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించాలని, తెగిన విద్యుత్తు వైర్లతో ప్రమాదాలు జరగకుండా చూడాలని, కూలిన స్తంభాలు స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసేలా సిద్ధం కావాలి. అధికార యంత్రాంగం అంతా సమిష్టిగా పనిచేసి తక్షణ చర్యలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణతో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్రాగునీరు, మెడికల్ క్యాంపులు, విద్యుత్తు సరఫరా, రవాణా వ్యవస్థలు ఆటంకం వాటిల్లిన తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు.రెవెన్యూ, మెడికల్, రవాణా, పోలీసు, పంచాయతీ, ఆర్‌డబీ, విద్యుత్తు తదితర శాఖలు అధికారులు అంతా సమిష్టిగా నిరంతరం పర్యవేక్షణ చేసి నివారణ చర్యలు చేపట్టాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవటానికి అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు.



## విద్యార్థినులకు పాఠాలు బోధించిన పోలవరం జిల్లా కలెక్టర్
-క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు

**ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం**

పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సోమవారం ఆకస్మిక పర్యటనలు చేపట్టారు ఇందులో భాగంగా వైరామవరం మరియు అడ్డతీగల మండల పరిధిలోగల పాఠశాలలను మరియు ఆ ప్రాంతాలలో లోతట్టు గ్రామాలకు సమస్యాత్మకంగా ఉన్న రహదారిని పరిశీలించారు ఆశ్రమం పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ తరగతి గదులు పరిశీలించి విద్యార్థిని విద్యార్థులతో ముచ్చటించారు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలోని అంశాలను ప్రశ్నించి ఆ అంశాలను వారికి బోధించారు. అనంతరం యార్లగడ్డ, మఠం భీమవరం మధ్య ఉన్న రహదారిపై ప్రత్యక్షంగా నడుస్తూ పర్యవేక్షించి ఆ రోడ్డు పరిస్థితిని స్థానిక ప్రజలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు పరిస్థితిని గమనించి తిరిగి ఆ రోడ్డు పునర్నిర్మాణానికి తగిన చర్యలకే ఆదేశాలు జారీ చేశారు

## పేద విద్యార్థులకు వాకర్స్ క్లబ్ పాలకొల్లు మందుల సాయం



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

అమలాపురం పట్టణానికి చెందిన పేద కుటుంబానికి 9 వ తరగతి విద్యార్థి చోడిశెట్టి హేమంత్ వినయ్ టైప్ 1 డయాబెటిస్ తో బాధపడుతూ ఇన్సులిన్ కొనుగోలు చేయడానికి కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి తీసుకురావడంతో క్లబ్ తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యుల తో కలిసి అతనికి పదివేల రూపాయల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లు సోమవారం అందించారు. అదే విధంగా పాలకొల్లు పట్టణం 23 వ వార్డుకు చెందిన డిగ్రీ విద్యార్థినికి వైద్యం నిమిత్తం10 వేల రూపాయల విలువైన మందులను అందించడం జరిగింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, నంబూరి గంగాపవన్ , సోమంచి శ్రీనివాసశాస్త్రి, మేకా త్రిశూలపాణి, కోట చంటియ్య, నేలపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆర్నాబ్ తుఫాన్ దృష్ట్యా విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవులు.



**ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా**

ఏలూరు, జిల్లాలో అర్నాబ్ తుపాను తీవ్రత దృష్ట్యా జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఈనెల 27, 28 సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావం మరియు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందరూ గమనించి, సంబంధిత విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు.